# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :117 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 09-07-2025 | పేజీలు:4 వెల: 2.00


## రాష్ట్రానికి చెందిన ఇద్దరికి కేంద్ర చేనేత, జౌళి శాఖ అవార్డులు

హైదరాబాద్, కేంద్ర చేనేత, జౌళి మంత్రిత్వ శాఖ ప్రకటించిన జాతీయ చేనేత పురస్కారం – 2024 కి తెలంగాణ రాష్ట్రం నుంచి ఇద్దరు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర చేనేత కార్మికులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు. దేశవ్యాప్తంగా 19 మంది చేనేత కార్మికులు ఎంపిక కాగా, అందులో తెలంగాణ నుంచి ఇద్దరికి పురస్కారాలు దక్కడం గర్వకారణమని మంత్రి అన్నారు. యాదాద్రి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం, పుట్టపాక గ్రామానికి చెందిన గజం నర్మదకు చేనేత వస్త్రాల మార్కెటింగ్ విభాగంలో 8 కోట్ల టర్నోవర్ చేసినందుకు.. సహజ సిద్ద రంగులను ఉపయోగించి జీఐ ట్యాగ్ పొందిన తేలియా రుమాల్ డిజైన్‌తో పట్టుచీరను నేసిన గూడ పవన్‌కు జాతీయ చేనేత అవార్డుకు ఎంపికై చేనేత రంగంలో ఆదర్శంగా నిలిచారని మంత్రి తెలిపారు. చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా చేయూతనివ్వడం జరుగుతుందన్నారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని.. అందులోభాగంగానే ఇటీవల చేనేత కార్మికుల కోసం రుణమాఫీ ప్రకటించి, 33 కోట్లు మంజూరు చేశామన్నారు.

## బీఆర్ఎస్‌కి వ్యతిరేకంగా రాస్తే ఆంధ్రా మీడియానా..



ఢిల్లీ: కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న కోపాన్ని పత్రికలు, టీవీ ఛానల్ మీద బీఆర్ఎస్ నేతలు చూపిస్తున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్ల కేసీఆర్ అధికారం గురించి ఇప్పుడు మీరు చేసుకున్నటువంటి చెడుప్రచారం గురించి ఏ ఛానల్ అయినా చెప్పక తప్పదు కదా అని ప్రశ్నించారు. ఆయా కథనాలు చెప్పినప్పుడు మీరు ఒక రాజకీయ పార్టీగా ఉండి మంచిని, చెడును రెండింటిని ఆస్వాదించడం నేర్చుకోవాలని సూచించారు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి. అది కాకుండా మీడియాపై దాడి చేయడమే కాకుండా ఇంకా దాడులు చేస్తామని మాట్లాడటం సరికాదని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. కేసీఆర్ మీరు ఫామ్‌హౌస్‌లో ఉండి మీ అల్లుడు, కొడుకు రెచ్చగొట్టి కార్యకర్తలతో మాట్లాడిస్తున్నారని విమర్శించారు. ఇవాళ(మంగళవారం) ఢిల్లీ వేదికగా చామల కిరణ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. దేశంలో తెలంగాణను ముందుంచే ప్రయత్నం చేస్తున్న సమయంలో బీఆర్ఎస్ నేతలు ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతున్నారని ధ్వజమెత్తారు. ఇక్కడున్న వ్యాపారస్తులను, పత్రికల యాజమాన్యాలను బీఆర్ఎస్ నేతలు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ అంటే తెలంగాణ అని ప్రచారం చేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి.

### రెచ్చగొట్టి దాడులకు ప్రేరేపిస్తున్నారు..

'బీఆర్ఎస్‌కి వ్యతిరేకంగా రాసే పత్రికలు, టీవీలపై దాడులకు ఉపక్రమించడం సరికాదు. ఉద్యమ సమయంలో మాదిరిగా తిరిగి సెంటిమెంట్‌ని రగిల్చే ప్రయత్నం చేస్తున్నారు. బావ, బామ్మర్ధులు బీఆర్ఎస్ కార్యకర్తలను రెచ్చగొట్టి దాడులకు ప్రేరేపిస్తున్నారు. వాళ్ల గురించి అనుకూలంగా రాసే పత్రికలు, టీవీ ఛానళ్లనే తెలంగాణకి సంబంధించినవని చెబుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ గురించి ఎవరూ నెగిటివ్‌గా మాట్లాడవద్దని, తాము చేసిన తప్పిదాలు రాయొద్దు, ఛానల్‌లో చూపించవద్దు అంటే ఎలా?. తెలంగాణలో బీఆర్ఎస్ గురించి ఎవరూ నెగిటివ్‌గా మాట్లాడినా, రాసినా ఆంధ్ర ఛానల్ అంటున్నారు. గతంలో దివంగత నేత నందమూరి తారక రామారావు దగ్గర బీఫామ్ కోసమే కేసీఆర్ తన కొడుకు పేరుని అబద్ధంగా చెప్పారు. ఆ తర్వాత నుంచి అజయ్ అన్న పేరుని తారక రామారావుగా మార్చుకున్నారు. కానీ మళ్లీ ఇప్పుడు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల మధ్య వ్యత్యాసం తీసుకువచ్చి అందరూ సుఖంగా ఉన్న హైదరాబాద్ నగరంలో ప్రజలను రెచ్చగొడుతున్నారు. కేటీఆర్ స్నేహితులంతా ఆంధ్ర వాసులే, ఆయన తిరిగిన ఫిలిమ్ ఇండస్ట్రీకి సంబంధించిన మిత్రులందరూ ఆంధ్ర వాళ్లే. కేటీ రామారావు చదువుకున్నది గుంటూరు విజ్ఞాన్ కాలేజ్‌లో.. ఆ కాలేజ్‌లో చదివి జ్ఞానం లేని మాటలు కేటీఆర్ మాట్లాడుతున్నారు. తెలంగాణ ప్రజలని మభ్యపెట్టి కేసీఆర్ అధికారంలోకి వచ్చారు. మా ప్రభుత్వంలో హైదరాబాద్‌ని గ్లోబల్ సిటీగా చేయాలనుకుంటున్నాం. ఒక మంచి రైసింగ్ తెలంగాణ స్లోగన్‌తో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు పోతోంది' అని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బేసిక్ నాలెడ్జ్ లేదు

హైదరాబాద్,రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బేసిక్ నాలెడ్జ్ లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఆయన 18 నెలలుగా రైతులను మోసం చేశారని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని కూడా నిలబెట్టుకోకుండా రంకెలేస్తున్నారని మండిపడ్డారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. రేవంత్‌కు రచ్చ చేయడం తప్ప.. చర్చ చేయడం రాదని ఎద్దేవా చేశారు.రేవంత్ సవాల్‌ను స్వీకరిస్తే ఆయన చర్చకు రాలేదని, రేవంత్ మాట తప్పుతారని తెలిసినా సవాల్‌ను స్వీకరించామని కేటీఆర్ అన్నారు. సీఎం కాకపోయినా కనీసం మంత్రి అయినా చర్చకు వస్తారని అనుకున్నామని చెప్పారు. తెలంగాణ నిధులు ఢిల్లీకి పోతున్నాయని, రైతులపై సీఎం రేవంత్ రెడ్డికి గౌరవం లేదని ఆరోపించారు.సీఎం ఢిల్లీకి ఎందుకు వెళ్లారని అడిగితే ఎరువుల కోసమని చెబుతున్నారని కేటీఆర్ తెలిపారు.రైతుబంధు అందరికీ ఇచ్చేశామని చెప్పుకుంటున్నారని, కొడంగల్‌లో ఎంతమంది రైతులకు రైతుబంధు పడలేదో లిస్ట్ రెడీగా ఉందని చెప్పారు. రైతుల మరణాల లిస్ట్ కూడా తీసుకొచ్చామని, ఆనాటి ఎమర్జెన్సీ పరిస్థితి ఇప్పుడు తెలంగాణలో కనిపిస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా మరోసారి సవాల్ చేస్తున్నానని, రేవంత్‌తో చర్చకు సిద్ధమని కేటీఆర్ చెప్పారు. ప్లేస్ ఎక్కడో డిసైడ్ చేయాలని సవాల్ చేస్తున్నానని, డేట్ కూడా మీరే ఫిక్స్ చేయండని అన్నారు. ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తామన్నారు. చర్చ కోసం రేవంత్ ఇంటికి రమ్మన్నా వెళ్తామని చెప్పారు. రేవంత్ స్థాయికి కేసీఆర్ అవసరం లేదని, తాము చాలని అన్నారు.కాంగ్రెస్ నేతలకు నిజాయితీ ఉంటే చర్చకు రావాలని, లేదంటే క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ముక్కు నేలకు రాసి కేసీఆర్‌కు క్షమాపణ చెప్పాలన్నారు. కేటీఆర్‌తో చర్చకు వచ్చే సత్తా లేనప్పుడు.. రేవంత్ రెడ్డి మరోసారి సవాల్ చేయొద్దని



చెప్పారు. రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్ళింది యూరియా బస్తాల కోసం కాదని, ఏ బస్తాలు మోసి రేవంత్ ముఖ్యమంత్రి పదవిని కాపాడుకుంటున్నారో అందరికీ తెలుసని అన్నారు.రేవంత్ రెడ్డికి రచ్చ చేయటమే తెలుసని, చర్చ చేయటం రాదని విమర్శించారు. ఏ బేసిన్ ఎక్కడుందో తెలియని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డని ఎద్దేవా చేశారు. రేవంత్ హయాంలో నీళ్ళు ఆంధ్రకు.. నిధులు ఢిల్లీకి.. నియామకాలు రేవంత్ తొత్తులకు దక్కుతున్నాయని అన్నారు. గురువు చంద్రబాబు కోసం తెలంగాణ నీళ్ళను ఆంధ్రకు పంపుతున్నారని ఆరోపించారు.రేవంత్ మోసాలు చేసి నాలుగు రోజులు తప్పించుకోవచ్చని, కానీ ప్రజలు క్షమించరని కేటీఆర్ అన్నారు.సవాల్ విసిరి మాట తప్పడం సీఎం రేవంత్ రెడ్డికి అలవాటని ఆరోపించారు. 2018లో కొండగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పి, ఆ తర్వాత మాట తప్పాడని గుర్తుచేశారు.


## కొత్త టిమ్స్ హాస్పిటళ్లలో ఆధునిక సాంకేతిక పరికరాలు కొనాలి

హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న టిమ్స్ హాస్పిటల్స్ తోపాటు వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో అత్యాధునిక టెక్నాలజీ ఉన్న మెడికల్, డయాగ్నస్టిక్స్ ఎక్విప్మెంట్ను కొనుగోలు చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. డాక్టర్లు. సిబ్బంది, పేషంట్ల అవసరాలకు అనుగుణంగా ఫర్నీ చరు కొనుగోలు చేయాలని అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ఎక్విప్మెంట్ కొనుగోలు చేయాలని మంత్రి సూచించారు. టిజిఎంఎస్ ఐడిసిపై మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష నిర్వహించారు.

### తగిన ఫర్నీచర్, ఎక్విప్మెంట్ సరిపడా ఉండాలి

ఈ మంత్రి మాట్లాడుతూ.. కార్పొరేట్ సందర్భంగా హాస్పిటల్స్ వినియోగిస్తున్న ఎక్విప్మెంట్ ఏమిటో డాక్టర్లను అడిగి తెలుసు కోవాలన్నారు. డాక్టర్లు, సిబ్బంది, పేషెంట్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఫర్నీచర్ కొనుగోలు చేయాలన్నారు. కొత్త హాస్పిటళ్లకు పేషెంట్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుందని, ఆ అంచనాలకు తగ్గట్టుగా ఫర్నీచర్, ఎక్విప్మెంట్ సరిపడా ఉండాలన్నారు. కొనే ప్రతి వస్తువుకూ వారంటీ ఉండాలని, మెయింటనెన్స్ విషయంలో సప్లయర్లను వాధ్యులుగా చేయాలన్నారు. ఒక్క వస్తువు కూడా రిపేర్, నిరుపయోగంగా ఉండే ఉండకూడదన్నారు. ప్రభుత్వ దవాఖానలో మెడిసిన్ సరఫరాపై వివిధ విభాగాల హెచ్వోడీ లను మంత్రి వివరాలు అడిగారు. అవసరమైన అన్ని మెడిసిన్స్ అందుబాటులో ఉన్నాయా? లేవా అని డీఎంఈ, వైద్యవిధాన పరిషత్ కమిషనర్, డైరక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధుల కాలం కావడంతో పేషెంట్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందని, అందుకు అనుగుణంగా మెడిసిన్ అందుబాటులో ఉంచుకోవాలని మంత్రి ఆదేశించారు. సెంట్రల్ మెడిసినల్ స్టోర్లలో కనీసం 3 నెలలకు సరిపడా మెడిసిన్ అందుబాటులో ఉంచుకోవాలని టిజిఎం ఎస్ఐడిసి అధికారులకు మంత్రి సూచించారు.

### ప్రతి పీహెచ్సీలోనూ టెస్టులు



ప్రతి పీహెచ్సీలోనూ టెస్టులు అవసరమైన పేషెంట్ల నుంచి సాంపిల్స్ సేకరించాలని, 24 గంటల లోపల రిపోర్టులు అందజేయాలని మంత్రి ఆదేశించారు. గతేడాది కొత్తగా ప్రతి జిల్లాలోనూ మెడిసినల్ స్టోర్లను ఏర్పాటు చేశామని, ఆయా స్టోర్లకు పర్మినెంట్ బిల్డింగ్స్ నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు కేటాయించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. అన్ని జిల్లాల్లో బిల్డింగుల నిర్మాణాన్ని ప్రారంభించి, త్వరగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. మెడికల్ కాలేజీలు అన్నింటిలోనూ సీటీ స్కాన్ మిషన్లను అందుబాటులోకి తీసుకొచ్చామని, అలాగే అవసరమైన చోట ఎంఆర్ఐ యంత్రాల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించామని మంత్రి తెలిపారు.వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు వెల్నెస్ సెంటర్లలో ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్ కుమార్ తోపాటు ఇతర ఉన్నతాధి కారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. వెల్నెస్ సెంటర్లపై వస్తున్న వార్తల విషయంలో అధికారులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో తెలుసు కోవాలని అధికారులను ఆదేశించారు .

## ఉపాధి హామీ ఏపీవోలకు జీతాలు చెల్లించకపోవడం శోచనీయం



హైదరాబాద్ : జీతం రాకపోవడంతోపాటు పని ఒత్తిడి తట్టుకోలేక గుండెపోటుతో ఉపాధి హామీ ఏపీవో మృతి చెందిన ఘటనపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై హరీశ్‌రావు ఎక్స్ వేదికగా స్పందించారు.ఉపాధి హామీ ఏపీఓలకు మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం శోచనీయం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. చేసిన పనికి వేతనాలు రాక ఉపాధి హామీ సిబ్బంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ కుటుంబ పోషణ భారమై సతమతమవుతుంటే ఈ ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గం అని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి మనోవేదనకు గురై ఉపాధి హామీ ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి రావడం విచారకరం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.మరోవైపు పారిశుధ్య కార్మికులకు కూడా వేతనాలు రాక గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ఎన్నికల సమయంలో హామీలతో ఊదరగొట్టిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ఏమని సమాధానం చెబుతారు? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉపాధి హామీ ఏపీవోలు, పారిశుధ్య కార్మికుల పెండింగ్ లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన కమ్మగాని శ్రీనివాస్ (48) దేవరుప్పుల మండలంలో ఉపాధి హామీ ఏపీవోగా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం శ్రీనివాస్ మార్నింగ్ వాక్‌కు వెళ్లగా, దేవరుప్పులలోని జనగామ రోడ్డులో గల ఓ మోటర్ వెహికిల్ షోరూం వద్ద గుండెపోటు రావడంతో అక్కడికక్కడే చనిపోయాడు. పని ఒత్తిడితోపాటు మూడు నెలలుగా జీతం రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో ఏపీవో మృతి చెందాడని ఆరోపిస్తూ ఉపాధి హామీ ఉద్యోగులు, సిబ్బంది నిరసన తెలిపారు. ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌రావు తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏపీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌రావు మాట్లాడుతూ ఉపాధి హామీ సిబ్బందిపై కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష చూపుతున్నదని ఆరోపించారు.

## తప్పుడు ప్రచారం చేస్తే నాశనం తప్పదు కేటీఆర్..!

హైదరాబాద్,బీఆర్ఎస్ నేత కేటీఆర్ పై మంత్రి సీతక్క మండిపడ్డారు. మంగళవారం ములుగు పట్టణంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేశారు.తనిపై తప్పుడు ప్రచారం చేస్తూ, వ్యక్తిగత దాడులకు దిగితే కేటీఆర్ నాశనం తప్పదని హెచ్చరించారు. " మీ చెల్లి నీ మీద దుమ్మెత్తి పోస్తుంది.. ఆమె పరిస్థితిని గమనించు కేటీఆర్!" అంటూ ఆమె ఫైర్ అయ్యారు. చిల్లర రాజకీయాల నుంచి బయటపడాలని హితవు పలికిన సీతక్క, "నువ్వు నిర్వహించిన పంచాయతీరాజ్ శాఖకు నేను మంత్రిగా వచ్చిన తరువాత భయపడుతున్నావ్. నేను ఎలాంటి కుల, కుటుంబ, అధికార పటిష్టత లేకుండా ప్రజల మద్దతుతో నిలబడ్డాను," అని వ్యాఖ్యానించారు. తన అన్న కూడా ఉద్యమ సమయంలో ప్రాణాలు కోల్పోయారని, తాను ఎవరినీ అండగా లేకుండానే పోరాటం చేసి ముందుకు వస్తున్నానని పేర్కొన్నారు.ఇక ములుగు అభివృద్ధిని అడ్డుకునేందుకు కేటీఆర్ కుట్రలు చేస్తున్నారని ఆమె ఆరోపించారు. "పక్క నియోజకవర్గాల్లో ఓడిపోయాక ఇక్కడికి వచ్చి డ్రామాలు చేస్తే ప్రజలు నమ్మరని" స్పష్టం చేశారు. పోలీసు వ్యవస్థను విమర్శిస్తూ కేటీఆర్ చేస్తున్న ఆరోపణలు అసత్యమని అన్నారు. లక్ష్మీదేవిపేట, చల్వాయి గ్రామాల్లో యువకులపై పెట్టిన



కేసులను గుర్తు చేస్తూ, "వాస్తవంగా నువ్వు ధైర్యవంతుడివైతే చర్చకు సిద్ధమవ్వు" అని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ పాలనపై విమర్శలు గుప్పించిన మంత్రి, "పదేళ్లలో కనీసం వేయి ఇండ్లయినా ములుగులో నిర్మించారా? ఇప్పుడేమి మాట్లాడతారు?" అంటూ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వ్యక్తిగతంగా విమర్శిస్తున్న కేటీఆర్‌కు సంస్కారం లేదని, ప్రజాస్వామ్య పాలన ఎలా ఉంటుందో ములుగులో తాము చూపిస్తున్నామని అన్నారు.

## అక్బరుద్దీన్ కు హైడ్రా మినహాయింపు ఇచ్చిందా?



మేడిపల్లి/ భీమారం (జగిత్యాల జిల్లా) : అక్రమ నిర్మా ణాల పేరుతో పేదల ఇండ్లను కూల్చివేస్తున్న హైడ్రా అధికారులు చెరువులు, కుంటల్లో భవంతులు నిర్మించి కాలేజీలు, వ్యాపారాలు చేసుకుంటున్న అక్బరుద్దీన్ ఒవైసీ కుటుంబానికి మినహాయింపు ఇచ్చారా అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. మేడిపల్లి, భీమారం మండలాల్లో పర్యటించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కేంద్ర ప్రభుత్వ నిధులతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. వెంకట్రావుపల్లెలో పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన వేంకట్రావుపల్లె స్కూల్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్బరుద్దీన్ కాలేజీలో 10 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నందున అక్రమ నిర్మాణాలైనా వాటిని కూల్చలేమని చెబుతున్న హైడ్రా అధికారులు.. ఏ జీవనాధారం, గూడు లేక మూసీ పరివాహక ప్రాంతాల్లో కట్టుకున్న గుడిసెల్లో, చిన్న చిన్న ఇండ్లను ఎందుకు కూల్చివేశారని నిలదీశారు."పేదల గుడిసెలు కూలుస్తూ, అధికారులకు అప్పగించని అక్రమ భవనాలకు రక్షణ ఎందుకు?" ఎ బండి సంజయ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు అక్బరుద్దీన్ కుటుంబానికే విలువ ఉంటుందా? పేదల ప్రాణాలకు, జీవితాలకు విలువ లేదా? వాళ్లు మనుషులు కాదా? ఎంఐఎం నాయ కులు పోలీసులను కొడితే చర్యలు తీసుకోరని, కరెంట్ బిల్లులు కట్టకుంటే వత్తాసు వలుకుతారా? ప్రభుత్వ, ప్రైవేట్ భూములను కబ్జా చేస్తే వత్తాసు పలుకుతారా? ఆఖరికి తీవ్రవాదులతో సంబంధాలున్న వాళ్లకు ఉద్యోగాలిచ్చి పోషిస్తుంటే పట్టించుకోరా? ఇదేం పద్దతి.."అంటూ మండి పడ్డారు. మీడియాపై దాడులు చేస్తుంటే ముఖ్యమంత్రి, ప్రభుత్వం ఏం చేస్తోందని మండిపడ్డారు. రేవంత్ రెడ్డిగారు.. మీకు పౌరుషం లేదా? మిమ్ముల్ని ఆకారణంగా జైల్లో వేసి బెయిల్ రాకుండా చేశారు కదా? అవన్నీ మర్చిపోయి వాళ్లతో కుమ్మక్కైపోయారా? కాళేశ్వరం, ఈఫార్ములాసహా అనేక స్కాంలు చేసిన కేసీఆర్ కుటుంబాన్ని మీడియాతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి బండి సంజయ్ ఎందుకు అరెస్ట్ చేసి బొక్కలో వేయడం లేదని నిలదీశారు. ప్రజాస్వామ్యాన్ని, మీడియా స్వేచ్ఛను కాపాడే విషయంలో బీజేపీ ముందుంటుందని చెప్పారు.

### అక్బరుద్దీన్ కాలేజీకి మినహాయింపు ఇచ్చి, మూసీ పరివాహకంలో పేదవారి గుడిసెలను ఎందుకు కూల్చారు?

అక్బరుద్దీన్ కాలేజీలో 10 వేల మంది విద్యార్థులు ఉన్నారంటూ అక్రమ నిర్మాణాలు కూల్చలేమని హైడ్రా అధికారులు అంటున్నారు. అయితే మూసీ పరివాహకంలో పేదవారి గుడిసెల్ని ఎందుకు కూల్చేశారో చెప్పాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## ఎన్నికల ముందు బీహార్‌పై వరాలు..



పాట్నా:బీహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నాయి. త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ రానుంది. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం తీవ్ర కసరత్తు చేస్తోంది. ఇక అధికారం కోసం ఎన్డీఏ, ఇండియా కూటమి పక్షాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి.నువ్వానేనా? అన్నట్టుగా బరిలోకి దిగబోతున్నాయి. ఇక మరోసారి అధికారం కోసం ఎన్డీఏ కూటమి ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలోనే కేంద్రం ఎక్కువగా ఫోకస్ పెట్టింది. అంతేకాకుండా ఇప్పటికే పలుమార్లు ప్రధాని మోడీ పర్యటించారు.ఇక తాజాగా కేంద్రం బీహార్‌పై వరాల జల్లు కురిపించింది. బీహార్ రైల్వే అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కీలక ప్రకటన చేశారు. బీహార్‌కు 4 కొత్త అమృత్ భారత్ ట్రైన్లు నడపబోతున్నట్లు చెప్పారు. రూ.2000 కోట్లతో కొత్త ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 104 కిలోమీటర్ల బక్తియార్పూర్ - రాజ్‌గిర్ - తిలైయా రైలు మార్గ డబులింగ్‌కు నిధులు మంజూరు చేశారు. ఈ రైలు మార్గ విస్తరణతో ప్రయాణికులకు లాభం జరగనుంది. ఇక స్థానికులకు కూడా ఉపాధి దొరకనుంది.ఇక తాజాగా బీహార్ ఎన్నికలపై ఆయా సంస్థలు చేసిన సర్వేలు బయటకు వస్తున్నాయి. ఇంక్‌ఇన్‌సైట్ విడుదల చేసిన అభిప్రాయ సేకరణ ఫలితాలు వెల్లడయ్యాయి.

## సంపాదకీయం

**బుధవారం 09-07-2025**

# మొక్కల పెంపకం మన బాధ్యత కాదా ?

మొక్కలు నాటడం, సంరక్షించడం నిత్యకృత్యంగా కావాల్సిన కార్యక్రమాన్ని ప్రజలు మరిచి పోయారు. గతంలో చెరువుల,పొలంగట్లు, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటడం విధిగా భావించేవారు. రైతులు నిత్యం ఏదో ఒక మొక్కను నాటుతూపచ్చదనానికి పాటుపడేవారు. కానీ కాలం మారింది. ప్రజల జీవన విధానం మారింది. దీంతో పర్యావరణ రక్షణకు అవసరమైన మొక్కలను పెంచడం మానేశారు. దీనికితోడు వెనకటికి పెంచిన మొక్కలను తెగనమ్ముతున్నారు. దీంతో గ్రామాలన్నీ ఎడారులుగా మారుతు న్నాయి. మొక్కలు పెంచడం కూడా ప్రభుత్వానిదే బాధ్యత అన్నట్లుగా తయారయ్యింది. ఇందులో తమ ప్రమేయం లేదన్నట్లుగా ప్రజలు మిన్నకుండిపోతున్నారు. వాతవరణ ప్రతికూలతలు అనుభవంలోకి వస్తున్నా..మొక్కలను పెంచడం, చెరువులను సంరక్షించడం వంటి పనులు మానేశారు. సముద్రతీరంలో ఉండే మడ అడవులను కూడా ధ్వంసం చేసిన చరిత్రకొందరిది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రజలు మొక్కల పెంపకంపై పెద్దగా శ్రద్ధ చూపడం లేదు. అడవుల నరికివేత కారణంగా గ్రామాల్లో కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. పంటలను నాశనం చేస్తున్నాయి. దీంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. మొక్కలు పెంచితే కొతులు వస్తాయని కొత్త సిద్ధాంతం ఇప్పుడు వల్లె వేస్తున్నారు. దీంతో పొలంగట్ల వద్ద కూడా ఉన్నచెట్లు మాయం అవుతున్నాయి. అడవులతో పాటు, కొండలు,గుట్టలను కూడా నేలమట్టం చేసేస్తున్నారు. దీంతో పర్యావరణ విధ్వంసం జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఈ కక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం సోమవారం నుంచి మొదలు అయ్యింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అటవీశాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో అధికారికంగా ప్రారంభించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ హరితహారం విరివిగా చేపట్టారు. ఎవు కార్యక్రమం చేపట్టినా మార్పు రావడం లేదు. ఎందుకంటే ఉద్యమంగా మొక్కల పెంపకం సాగితే తప్ప మార్పు కనిపించదు. ఇకపోతే వన మహోత్సవానికి అటవీశాఖ అధికారులు నెల రోజుల నుంచి తీవ్ర కసరత్తు చేస్తున్నారు. ఇతర శాఖల ఉన్నతాధికారుల సమన్వయంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయ వంతంగా పూర్తిచేయాలని ప్రణాళికలు రూపొందించారు. వర్షాలు కురుస్తున్న ప్రాంతాల్లో మొక్కలు నాటే నాటేందుకు సిద్ధమయ్యారు. ఈ ఏడాదిలో వనమహోత్సవంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 18.02 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గతంలో మాదిరిగా కాకుండా నాటిన ప్రతి మొక్కను బతికించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ముందస్తు ప్రణాళికలు తయారు చేశారు. ముఖ్యంగా నాటిన మొక్కలకు నీటి సదుపాయం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని భావిస్తున్నారు. గతంలో నాటిన మొక్కలు చనిపోతే వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటేవారు. ఒకప్పుడు ఎక్కడ చూసినా వేప, తుమ్మ, మామిడి, మర్రి,రావి ఈత వంటి చెట్లు ఎక్కడపడితే అక్కడ దర్శనం ఇచ్చేవి. కానీ కాలక్రమంలో ఉన్నవి నరికివేయగా, కొత్తగా మొక్కలునాటే పద్దతని ప్రజలు మరచిపోయారు. ఇరు తెలుగు రాష్ట్రాల్లో అను వృక్ష జాతులకు చోటు లేకుండా చేశాయి. కలుపు మొక్కలు, విదేశీ జాతులను తొలగించి, కొత్తగా మళ్లీ మన నేలలకు అనువైన మనజాతి మొక్కలను నాటాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సాంప్రదాయ స్థానిక మొక్కలను పునరుద్ధరించడానికి, బదులు ఏటా నిర్లక్ష్యం చేస్తున్నారు. కలప, అటవీ పండ్లు, అటవీ పూల జాతులు, వివిధ రకాల వెదురు జాతులను నాటాలని ప్రణాళిక రూపొందించినా అమలు కావడం లేదు. ఇకపోతే తెలంగాణలో రైతులకు వ్యక్తిగత ఆదాయానిచ్చే పండ్ల మొక్కలు పెద్ద ఎత్తున నాటేందుకు పంపిణీ చేస్తున్నారు. ఇంటి ఆవరణంలో పెంచే మొక్కలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ప్రధానంగా పండ్ల మొక్కల ను ఎక్కువగా పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వ స్థలాల్లో పూల మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకో నున్నారు. జూలై, ఆగస్టు మాసాల్లో మొక్కలు నాటే లక్ష్యం పూర్తి చేస్తేనే, వర్షాకాలం పూర్తయ్యేనాటికి నాటిన మొక్కలు దాదాపు 90 శాతంకు పైగా బతుకుతాయని అటవీ అధికారులు అంచన వేస్తున్నారు. ఈ సారి వంద శాతం మొక్కలు నాటాలని టార్గెట్ పెట్టుకున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. నాటే మొక్కలను ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి నాటకుండా అదే గ్రామంలో వన నర్సరీల ద్వారా పెంచిన మొక్కలు నాటే అలవాటును ప్రజల్లో ప్రోత్సహించడం అవసరం. మొక్కలు నాటే కార్యక్రమం, వాటిని పెంచేందుకు స్థానిక ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రకృతి ప్రేమికులను భాగస్వాములుగా కాలవాల్సి ఉంది. ప్రతి ఒక్కరు మొక్కలు నాటే విధంగా ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలి. ఇంటి పేరట్లో గులాబీ, మందార, సీతాఫలం, జామ, ఉసిరి, అల్లనేరేడు, మునగ, కానుగ, తులసి, ఈత మొక్కలతో పాటు- పలు ఔషద మొక్కలు, పూల మొక్కలను పంపిణీ చేసి ప్రజలు పెంచేలా చేయాలి. పూల మొక్కలను ప్రభుత్వ స్థలాలు, రహదారులకు ఇరువైపులా, పొలం, చెరువు గట్లు-, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలు, కమ్యూనిటీ కేంద్రాలు, వైద్య శాలలు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు- పాఠశాలలు, కళాశాలల ఆవరణల్లో విరివిగా నాటాలి. ముఖ్యంగా విద్యార్థులను మొక్కలు నాటేలా కార్యక్రమం చేపట్టాలి. ఈత, తాటి, వేప, చింత, కుంకుడు మొక్కలు నాటించేందుకు ఏటా చర్యలు చేపట్టాలి. పెద్ద ఎత్తున మొక్కలు నాటిన వారిని గుర్తించి ప్రోత్సాహకాలు ఇవ్వడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేయవచ్చు. ఇకపోతే తెలంగాణలో వనమహోత్సవంలో గ్రామీణాభివృద్ధి శాఖ ఇతర శాఖల కంటే ఎక్కువ మొక్కలు నాటనుంది. ఈ శాఖ పరిధిలో 7 కోట్ల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటి వరకు 2.30 కోట్ల మొక్కలు నాటేందుకు కావాల్సిన గుంతలను సిద్ధం చేసి ఉంచారు. ఇంటింటికి ఆరు మొక్కల చొప్పున మొక్కలు పంపిణీ చేయనున్నారు. ఆగస్టు చివరి నాటికి మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ఈ సారి తాటి, ఈత మొక్కలు నాటేందుకు పెద్దపీట వేశారు. అత్యధికంగా ఈ సంవత్సరం 25 లక్షల మొక్కలు తాటి, ఈత మొక్కలు నాటనున్నారు. అంతే కాకుండా రైతులకు వ్యక్తిగతంగా ఆదాయాన్ని సమకూర్చే పండ్లతోటల మొక్కలు నాటేందుకు తొలి ప్రాధన్యత కల్పించారు. 22 వేల ఎకరాల విస్తీర్ణంలో మొక్కలు పెంచనున్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకుని వచ్చేందుకు గ్రామాల వారీగా కార్యక్రమలు చేపడితే మంచి ఫలితం ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో ఇందుకు కార్యచారణ తో ముందుకు సాగాలి.

# పువ్వాడ ఏంటిది? కేడర్ ఆవేదన

హైదరాబాద్,అనుచరులు అనుకున్న వాళ్లే ఆయన్ను నిట్ట నిలువునా ముంచారట. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి అన్న చందంగా భారీగా వెనకేశారట. ఫలితం.. ఆయన ఓటమి. పోనీ.. అధికారం దూరమయ్యాక అయినా ఆయన మారారా అంటే అలాంటిదేమీ లేదట. ఎవరైతే ఆయన ఓటమికి కారణమయ్యారనే విమర్శలు విన్పిస్తున్నాయో.. మళ్లీ వాళ్లే ఇప్పుడు ఆయన చుట్టూ ఉన్నారట. దీంతో.. పార్టీ కోసం నిజాయితీగా పనిచేసే కేడర్ ఆవేదన చెందుతోందట. ఇంతకీ ఆయన ఎందుకిలా చేస్తున్నారు..? బీఆర్ఎస్ నాయకుల్లో ఇప్పుడివే ప్రశ్నలు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదేళ్ల పాటు హవా

పువ్వాడ అజయ్ కుమార్.. బీఆర్ఎస్ హయాంలో ఓ వెలుగు వెలిగిన నేత. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదేళ్లపాటు పార్టీలో చక్రం తిప్పిన లీడర్. ఖమ్మం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున 2014లో ఎమ్మెల్యేగా గెలిచారు పువ్వాడ అజయ్. మారిన పరిస్థితులలో అప్పట్లో టీఆర్ఎస్‌లో చేరారు. 2018 ఎలక్షన్లలో మరోసారి విజయం సాధించారాయన. అంతేకాదు నాటి.. కేసీఆర్ మంత్రివర్గంలో చోటు సంపాదించారు పువ్వాడ అజయ్ కుమార్. ముచ్చటగా మూడోసారి 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టాలని భావించారు పువ్వాడ అజయ్. కానీ, ప్రజల తీర్పు మాత్రం మరోలా వచ్చింది. కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగిన సీనియర్ నేత తుమ్మల నాగేశ్వర్ రావును ప్రజలు బంపర్ మెజార్టీతో గెలిపించారు. దీంతో.. పువ్వాడకు షాక్ తప్పలేదు.

పువ్వాడ అజయ్ ఎలా ఓటమి పాలయ్యారన్నది.. అంతు చిక్కని మాట వాస్తవానికి.. నియోజకవర్గాన్ని భారీగా అభివృద్ధి చేశారన్న పేరు తెచ్చుకున్నారు మాజీ మంత్రి పువ్వాడ అజయ్. ఇంకా చెప్పాలంటే ఎక్కడ అవకాశం ఉన్నా నిధులు తీసుకొచ్చి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని బీఆర్ఎస్ నేతలు చెబుతుంటారు. సోషల్ మీడియాను సైతం తన ప్రచారానికి బాగానే వాడుకున్నారట అజయ్. మరి.. అలాంటిది పువ్వాడ అజయ్ ఎలా ఓటమి పాలయ్యారన్నది ఆయనకు ఇప్పటికీ అంతు చిక్కడం లేదన్న మాట విన్పిస్తోంది.

పువ్వాడ ఓటమికి ప్రధాన అనుచరులే కారణం..!

అయితే.. ఇక్కడే ఓ ట్విస్టు ఉందట. పువ్వాడ ఓటమికి ప్రధాన కారణం ఆయన వెంట ఉండే ముఖ్యమైన అనుచరులేనట. దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలి అన్న చందంగా ఆయన చుట్టూ ఉండే కొందరు షాడో నేతలే అందినకాడికి దోచుకున్నారన్న ఆరోపణలు నియోజకవర్గంలో గుప్పుమంటున్నాయి. వాస్తవానికి మాజీ మంత్రి పువ్వాడ 2014 ఎన్నికల్లో ఇలాంటి షాడో నేతల ప్రమేయం లేకుండానే ముందుకెళ్లారు. విజయం సాధించారు. 2018 ఎన్నికల్లోనూ ఇదే మాదిరిగా విక్టరీ కొట్టారు. కానీ.. ఆ తర్వాతే సీన్ మారిపోయిందట. ఇంకా చెప్పాలంటే ఎప్పుడైతే కొంతమంది షాడో నేతలు ఆయనకు దగ్గరయ్యారో అప్పటి నుంచే ఆయన కెరీర్ గ్రాఫ్.. నియోజకవర్గంలో పడిపోతూ వచ్చిందట.

ఖమ్మం నగరంలో సెటిల్‌మెంట్లు, భూదందాలు బెదిరింపులతో

ఖమ్మం నగరంలో సెటిల్ మెంట్లు, భూ దందాలు, పోలీస్ స్టేషన్ సాక్షిగా పంచాయితీలు నిర్వహించడం, బెదిరింపులు ఇలా ఒకటేమిటి అనేక రకాల చర్యలతో.. పువ్వాడ చుట్టూ ఉన్న షాడో నేతలు ప్రజలను బాగానే ఇబ్బందులకు గురి చేశారన్న గుసగుసలు విన్పించాయి. అజయ్ ప్రధాన అనుచరుడిగా ఉన్న నగర పార్టీ నేతతోపాటు పలువురు కార్పొరేటర్లు ఇందులో కీలక పాత్ర పోషించారట. నియోజకవర్గంలో అనేక సమస్యలకు కారణంగా మారుతున్న



వాళ్లు పువ్వాడకు బాగా దగ్గరి వారు కావడంతో ఇతర నాయకులు, కేడర్.. ఆయా నేతలు చేసే అక్రమాలను పువ్వాడ దృష్టికి తీసుకెళ్లలేదట. అయితే.. ఇదే విషయాన్ని 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో తన ప్రచారంలో ప్రధానంగా ప్రస్తావించారు తుమ్మల నాగేశ్వర్ రావు. చివరకు విజయం సాధించారాయన.

పువ్వాడ అజయ్ ఓటమికి కారణం..!

అప్పటి వరకు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తనను గెలిపిస్తాయని భావించిన పువ్వాడ అజయ్‌కి ఓటమి దిమ్మతిరిగే షాక్ ఇచ్చిందట. అయితే.. ఇంత జరిగినా ఆయన మాత్రం ఇప్పటికీ తన ఓటమికి కారణాలు ఏంటన్న దానిపై ఓ నిర్ణయానికి రాలేకపోయారట. ఇందుకు కారణం తన ఓటమిపై పూర్తిస్థాయి విశ్లేషణ చేసుకోకపోవడమేనన్న వాదన బలంగా విన్పిస్తోంది.

ఓటమి నాటి నుంచి సైలెంట్‌గా ఉన్న పువ్వాడ

ఇదంతా ఒక ఎత్తైతే ఇప్పటికి కూడా పువ్వాడ అజయ్ వ్యవహార శైలి ఏ మాత్రం మారలేదన్న టాక్ విన్పిస్తోంది. ఎన్నికల తర్వాత చాలా రోజుల పాటు సైలెంట్‌గా ఉన్నారు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్. కానీ, ఇటీవలి కాలంలోనే అడపాదడపా నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. అందరినీ కలుస్తూ మళ్లీ ప్రజలకు దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారట అజయ్. కానీ, ఎవరైతే ఆయన ఓటమికి ప్రధాన కారణంగా నిలిచారో అలాంటి నేతలే ఇప్పుడు మళ్లీ ఆయన వెంట కన్పిస్తుండడం హాట్ టాపిక్‌గా మారుతోంది.

ఎందుకీ పరిస్థితి అంటున్న బీఆర్ఎస్ కేడర్

పువ్వాడ తీరుతో నిజాయితీగా పనిచేసే బీఆర్ఎస్ కేడర్ ఆవేదన చెందుతోందట. గెలుస్తారనుకున్న సీటు కాస్తా పోవడం, అయినా మాజీ మంత్రి పువ్వాడ పరిస్థితిలో మార్పు రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారట. ఇప్పటికైనా తమ నేత మారకపోతే ఎలా అని చాటుగా మాట్లాడుకుంటున్నారట. అసలు.. తన ఓటమికి కారణమైన టీమ్‌ను పువ్వాడ ఎందుకు దూరం పెట్టలేదన్న డిస్కషన్ నియోజకవర్గంలో గట్టిగానే జరుగుతోందట. ఇక్కడే మరో వాదనా విన్పిస్తోంది. తన ఓటమికి గల కారణాలు, అందుకు దారి తీసిన పరిస్థితులు, కారకులైన నాయకుల వివరాలు అన్నింటిపైనా పువ్వాడకు పూర్తిస్థాయిలో అవగాహన ఉందన్న ప్రచారం జరుగుతోంది. అయినా సరే తన ఓటమికి కారకులైన వారిని పక్కన పెట్టకపోవడానికి కారణం.. నియోజకవర్గంలోని పరిస్థితులేనన్న టాక్ నడుస్తోంది. నిజానికి మొదటి నుంచీ బీఆర్ఎస్‌కు ఖమ్మం జిల్లాలో పెద్దగా పట్టులేదు. పైగా ఇప్పుడు పార్టీ సైతం అధికారంలో లేదు. ఇలాంటి వేళ వాళ్లను దూరం పెడితే తన పక్కన కేడర్ లేకుండా పోతుందని భావిస్తున్నారట పువ్వాడ అజయ్. అందుకే తప్పని పరిస్థితుల్లోనే అలాంటి వారితో కలిసి ముందుకు సాగుతున్నారని పువ్వాడ అజయ్ వర్గం చెబుతోంది.

# కేంద్ర స్థాయిలో దగ్గుబాటి పురందేశ్వరికి బీజేపీ ఇచ్చే పదవి ఇదేనా?



అమరావతి,చిన్నమ్మకు పెద్ద పెదవి రాబోతోందా..? అందుకే కమలం అధిష్టానం ఆమెను రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించిందా..? పెహల్గామ్ అటాక్‌పై అంతర్జాతీయ వేదికల మీద మాట్లాడే అవకాశాన్ని ఇప్పటికే ఆమెకు కల్పించిన బీజేపీ అగ్రనేతలు.. ఢిల్లీ స్థాయిలో మరింత కీరోల్ ఇవ్వబోతున్నారా..? ఇంతకీ ఈ మొత్తం వ్యవహారంలో కాషాయ పార్టీ ఆలోచన ఏంటి..?

దగ్గుబాటి పురందేశ్వరికి పెద్ద పదవి రాబోతోందా..?

దగ్గుబాటి పురందేశ్వరి..! రాష్ట్ర రాజకీయాల్లోనే కాదు.. దేశ రాజకీయాల్లోనూ ఏ మాత్రం పరిచయం అక్కర్లేని పేరు. ఇలాంటి లీడర్‌కు రాబోయే రోజుల్లో పెద్ద పదవి ఇవ్వాలని భావిస్తోందట బీజేపీ అధిష్టానం. ఇదే విషయంపై కమలం పార్టీ ఢిల్లీ వర్గాల్లో పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోందట. ఎన్టీఆర్ కూతురుగా, నందమూరి బాలకృష్ణ సోదరిగా, సీఎం చంద్రబాబు బంధువుగా.. ఇలా అనేక కోణాల్లో రాష్ట్ర ప్రజలందరికీ సుపరిచితమైన మహిళా నేత పురందేశ్వరి. కాంగ్రెస్ పార్టీ తరఫున 2004, 2009 ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారామె. నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ కేబినెట్‌లో కేంద్రమంత్రిగానూ బాధ్యతలు నిర్వహించారామె.

ఏపీ విభజన తర్వాత బీజేపీలోకి ఎంట్రీ

రాష్ట్ర విభజన, అనంతర పరిణామాల్లో హస్తం పార్టీకి రాజీనామా చేసిన పురందేశ్వరి.. బీజేపీలో చేరారు. 2014 ఎన్నికల్లో ఓటమిపాలైనా.. పార్టీలో పలు పదవులు నిర్వహించారు. 2023 జులై 4న ఏపీ బీజేపీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారామె. 2024 ఎన్నికల్లో రాజమహేంద్రవరం నుంచి ఎంపీగా బరిలో దిగి బంపర్ విక్టరీ కొట్టారు పురందేశ్వరి. అధికార, విపక్షాల మధ్య చావో రేవో అన్నట్లు సాగిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో.. కూటమి పార్టీల విజయానికి తన వంతు కృషి చేశారు పురందేశ్వరి. అసలు.. రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఏర్పాటయ్యే విషయంలో పురందేశ్వరి సైతం గట్టి ప్రయత్నాలే చేశారట. రాష్ట్ర పార్టీ నుంచి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు టికెట్ల కేటాయింపులోనూ వ్యూహాత్మకంగా ఆమె వ్యవహరించారన్న ప్రచారం సాగింది. ఏపీ ఎన్నికల్లో 8 అసెంబ్లీ స్థానాలు, మూడు ఎంపీ సీట్లను బీజేపీ గెలుచుకోవడంలో పురందేశ్వరి కష్టం ఎంతో ఉందంటారు పార్టీ నాయకులు.

అంతర్జాతీయ వేదికలపై మాట్లాడే అవకాశం..

కేవలం రాష్ట్ర స్థాయిలోనే కాదు జాతీయ స్థాయిలోనూ మంచి పేరు సంపాదించుకున్నారు పురందేశ్వరి. ఏవైనా ముఖ్యమైన అంశాలపై మాట్లాడాలన్నా కసరత్తు చేసి మరీ పూర్తి పరిజ్ఞానంతో మాట్లాడతారన్న పేరు పొందారు పురందేశ్వరి. దీంతో.. ఇటీవలె ఆమెకు అంతర్జాతీయ వేదికలపై మాట్లాడే అవకాశం కల్పించింది మోడీ సర్కారు. పెహల్గామ్ దాడి అనంతర పరిణామాల్లో పాకిస్తాన్ కుయుక్తుల్ని అంతర్జాతీయ వేదికలపై ఎండగట్టేందుకు కేంద్రం ఏడు అఖిలపక్ష బృందాలను ఏర్పాటు చేసింది. వీటిలో ఓ టీమ్‌కు ప్రాతినిథ్యం వహించారు పురందేశ్వరి. ఈ బృందాలే ఫ్రాన్స్, యూకే, ఈయూ, ఇటలీ, డెన్మార్క్, జర్మనీ దేశాల్లో పర్యటించి దాయాది వైఖరిని ప్రపంచ దేశాల ముందు ఎండగట్టాయి. అలా చూస్తే కేంద్రంలోనూ చిన్నమ్మకు పెద్ద పలుకుబడే ఉందన్న మాట విన్పిస్తోంది.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా మాధవ్ నియామకం

అయితే.. పార్టీలో, నాయకుల్లో మంచి పేరు సంపాదించుకున్న దగ్గుబాటి పురందేశ్వరి స్థానంలో ఇటీవలె మాధవ్‌ను రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించింది బీజేపీ అధిష్టానం. దీంతో.. ఈ మార్పు దేనికి సంకేతం అన్న చర్చలు ఏపీలో విస్తృతంగా నడుస్తున్నాయి. హస్తిన వర్గాల నుంచి వస్తున్న సమాచారం, జరుగుతున్న ప్రచారం చూస్తే చిన్నమ్మకు పెద్ద పదవి ఇచ్చేందుకే కమలనాథులు యోచిస్తున్నారట. ఇందుకు కారణాలను ఓసారి పరిశీలిస్తే.. ఏపీలో ప్రస్తుతం కూటమిలో భాగస్వామిగా ఉన్నారు కమలనాథులు. రాబోయే రోజుల్లో బీజేపీని మరింత బలోపేతం చేయాలని భావిస్తున్నారు. దీంతో.. అనేక ఆప్షన్లు పరిశీలించిన కాషాయ పార్టీ పెద్దలు పురందేశ్వరికి కీలక పదవి అప్పగిస్తే ఏపీలో పార్టీ మరింతగా బలపడుతుందని భావిస్తున్నారట.

బీజేపీ జాతీయ అధ్యక్షురాలి రేసులో పురందేశ్వరి

ఈ క్రమంలోనే బీజేపీ జాతీయ అధ్యక్షురాలి రేసులో పురందేశ్వరి పేరు బలంగా విన్పిస్తోంది. ఈసారి కమలనాథులు మహిళలకు ఛాన్స్ ఇవ్వాలని చూస్తున్నారట. ఇందులో భాగంగా కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్, తమిళనాడుకు చెందిన వానతి శ్రీనివాసన్‌తోపాటు పురందేశ్వరి పేర్లు బలంగా విన్పిస్తున్నాయి. అయితే.. బీజేపీ జాతీయ అధ్యక్ష పదవి కేటాయించాలంటే పార్టీలో కనీసం 15 ఏళ్లు పనిచేసి ఉండాలి. అలాగని బీజేపీ పెద్దలు తలుచుకుంటే ఆ రూల్ ఏమీ అడ్డంకి కాబోదన్న మాట విన్పిస్తోంది. ఒక వేళ.. ఆ ఛాన్స్ చేజారితే.. లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ పదవి రేసులోనూ పురందేశ్వరి పేరు విన్పిస్తోంది. పురందేశ్వరి కోసం పలు ఆప్షన్లు చూస్తున్న కాషాయ పార్టీ పెద్దలు చివరకు ఏ ఛాన్స్ ఇస్తారన్నది అందరిలోనూ ఆసక్తిని..అంతకు మించిన ఉత్కంఠను రేకెత్తిస్తోంది.

## శ్రీకాకుళంలో దారుణం..

శ్రీకాకుళం: శ్రీకాకుళం జిల్లాలో దారుణం చోటుచేసుకున్నది. చికెన్ పకోడీ వివాదం ఒక వ్యక్తి ప్రణాలు తీసుకున్నది. మద్యంమత్తులో ఉన్న ఓ వ్యక్తి చికన్ పకోడీ లేదన్నాడని హొటల్ యజమానిని పీకకోసి చంపేశాడు. శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం వసప గ్రామానికి చెందిన మిన్నారావు అనే యువకుడు రాత్రి పూటుగా మద్యం సేవించాడు. మద్యం మత్తులో సమీపంలోని ఓ ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌కు వెళ్లిన అతడు చికెన్ పకోడీ కావాలని అడిగాడు. అయితే షాపు యజమాని శంకర్ లేదని చెప్పాడు. దీంతో తనకు ఎట్టి పరిస్థితుల్లో చికెన్ పకోడీ ఇవ్వాల్సిందే అంటూ పట్టుబట్టాడు.లేదని చెప్పినా వినకుండా షాపు తలుపులను గట్టిగా తన్నుతూ శంకర్‌పైకి దూసుకొచ్చాడు. అతని పీక నొక్కి కింద పడేసే ప్రయత్నం చేశాడు. దీంతో అప్పటికే మద్యం సేవించి ఉన్న శంకర్ కూడా పక్కనే ఉన్న సుత్తిని తీసి మిన్నారావు తలపై బలంగా కొట్టాడు. పక్కనే ఉన్న కత్తిని తీసి మిన్నారావు పీక కోశాడు.

# పాశమైలారంలో కొనసాగుతున్న రెస్క్యూ

సంగారెడ్డి,పాశమైలారం సిగాచి పరిశ్రమలో పేలుడు దుర్ఘటన జరిగి ఎనిమిది రోజులు దాటినా ఘటనా స్థలిలో రెస్క్యూ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది. ఈ పేలుడు ఘటనలో ఇప్పటి వరకు 42 మంది మృత్యువాత పడ్డారు. ఇంకా ఎనిమిది మంది ఆచూకీ లభించాల్సి ఉంది. ఐలా భవన్ వద్ద ఎనిమిది మంది కార్మికుల కుటుంబాలు పడిగాపులు కాస్తున్నారు. ఇక ఈ ప్రమాదంలో గాయపడ్డ వారిలో 18 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ప్రమాద సమయంలో 143 మంది ఉండగా 61 మంది ప్రాణాలతో సురక్షితంగా బయటపడ్డారు. మొత్తం 14 మంది కార్మికులు ఆస్పత్రిలో చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయ్యారు. ఇప్పటికే 70కి పైగా మానవ అవశేషాలను డీఎన్ఏ రిపోర్టు కోసం అధికారులు ల్యాబ్‌కు పంపించారు. కాగా.. సిగాచి పరిశ్రమను సందర్శించిన హైలెవల్ కమిటీ- ప్రభుత్వానికి ఓ నివేదికను సమర్పించింది. ఈ కమిటీ సభ్యులు గత శుక్రవారం ప్రమాద స్థలిని పరిశీలించారు. ప్రమాదం జరిగిన సమయం, కార్మికులు ఎంత మంది ఉన్నారు, పేలుడు జరగడానికి గల కారణాలపై ఆరా తీశారు. బాధిత కుటుంబాలతో మాట్లాడారు. అలాగే పరిశ్రమలో భద్రతా ప్రమాణాలపై కంపెనీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. చివరకు సేఫ్టీ రూల్స్ పాటించకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు- ప్రాథమికంగా నిర్ధారించిన కమిటీ సభ్యులు ఆ మేరకు ప్రభుత్వానికి నివేదికను అందజేసింది.పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో జరిగిన దుర్ఘటనలో ఆచూకీ లభించని కార్మికులు ఏమయ్యారో తెలియని పరిస్థితి. రెస్క్యూ బృందాలు కర్మాగారంలో భవనాల శిథిలాల తొలగింపు వేగవంతం చేసినా ఫలితం దక్కడం లేదు. దీంతో తమ వారి కోసం కార్మికుల కుటుంబసభ్యుల రోదనలతో ఆ ప్రాంతం హృదయ విదారకంగా మారిపోయింది. ఈ ప్రమాదంలో 8 మంది కార్మికుల ఆచూకీ ఇంకా లభించలేదు. ప్రమాదం జరిగి 8 రోజులవుతున్నా.. రాహుల్, రవి, వెంకటేశ్, ఇర్ఫాన్, విజయ్, అఖిలేశ్, జస్టిన్, శివాజీల ఆచూకీ కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. దీంతో ఐలా సెంటర్ వద్ద తమ వారి కోసం కుటుంబ సభ్యులు పడిగాపులు కాస్తున్నారు. చివరి చూపైనా దక్కుతుందేమోనని ఆశతో వారు రోజు ఇక్కడికి వస్తున్నారు. గల్లంతైన ఎనిమిది మంది విషయంలో డీఎన్ఏ రిపోర్టులు కీలకంగా మారనున్నాయి. 70కి పైగా నమూనాలను డీఎన్ఏ రిపోర్టుల కోసం అధికారులు పంపారు. మరోవైపు మంగళవారం పాశమైలారం సిగాచీ పరిశ్రమకు నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ బృందం రానుంది. ఘటనా స్థలాన్ని ఆ బృందం పరిశీలించనుంది. పరిశ్రమలో పేలుడుకు గల కారణాలపై ఎస్‌డీఎంఏతో కలిసి అధ్యయనం చేయనుంది. ప్రమాదానికి గల కారణాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిక ఇవ్వనుంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో సూచనలు చేయనుంది.

## ఆరునెలల్లోనే తాగునీటి ప్రాజెక్ట్ పూర్తి

అనంతపురం,ఏపీలో ఎక్కడా లేని విధంగా ఆరునెలల్లోనే తాగునీటి ప్రాజెక్ట్ పూర్తి చేశామని మంత్రి పయ్యావుల కేశవ్ వ్యాఖ్యానించారు. సోమవారం ఉరవకొండలో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని మంత్రి పయ్యావుల కేశవ్ మీడియాతో మాట్లాడారు. ఉరవకొండ నియోజకవర్గంలో తాగునీటి సమస్యని శాశ్వతంగా పరిష్కరించామని తెలిపారు. ఉరవకొండ పట్టణానికి తాగునీరు అందించేందుకు జనవరి ఒకటోవ తేదీన తాగునీటి పైప్‌లైన్ పనులు ప్రారంభించామని మంత్రి పయ్యావుల కేశవ్ గుర్తుచేశారు. పనులు పూర్తి చేసి ప్రాజెక్ట్‌ని నేడు ప్రారంభించామని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. రూ. 22కోట్లతో కేవలం ఆరునెలల్లోనే తాగునీటి ప్రాజెక్ట్ పూర్తిచేశామని తెలిపారు. ఆరోజే తాను చెప్పానని.. తనను గెలిపించిన ప్రజలకు సేవకుడిగా పని చేస్తానని అన్నారు. ఈ రోజు ఎన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం చూపించానని చెప్పుకొచ్చారు. వైసీపీ నేత వై. విశ్వేశ్వర్ రెడ్డి ఒక అసమర్థుడని చెప్పడానికి ఇదే నిదర్శనమని మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు.

## అమరావతి క్వాంటమ్ వ్యాలీ డిక్లరేషన్ ఆమోదం

అమరావతి,అమరావతి క్వాంటమ్ వ్యాలీ డిక్లరేషన్ ఆమోదిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంఉత్తర్వులు జారీ చేసింది. గత నెల 30వ తేదీన విజయవాడలో జరిగిన 'అమరావతి క్వాంటమ్ వ్యాలీ వర్క్‌షాప్ నిర్వహించినట్టు- ఉత్తర్వుల్లో పేర్కొంది ఏపీ ప్రభుత్వం. ఈ వర్క్‌షాప్ ద్వారా ప్రభుత్వ, పరిశ్రమ, విద్యా సంస్థలు, స్టార్టప్‌లు కలిసి కొత్త -టె-క్నాలజీని సమన్వయంతో పనిచేసే దిశగా చర్చలు తీసుకోవాలని తెలిపింది ప్రభుత్వం. అమరావతిని గ్లోబల్ క్వాంటమ్ టెక్నాలజీ హబ్‌గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో అమరావతి క్వాంటమ్ వ్యాలీ డిక్లరేషన్ ను జూన్ 30 ప్రకటించింది ప్రభుత్వం. ఈ డిక్లరేషన్‌పై సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ద్వారా క్వాంటం పరిశోధన, ఆవిష్కరణ, ప్రతిభ అభివృద్ధి, మౌలిక సదుపాయాలు అంతర్జాతీయ భాగస్వామ్యాలకు ప్రాధాన్యం ఇవ్వనునట్టు- తెలిపింది ప్రభుత్వం.. దేశంలోపే అతి పెద్ద క్వాంటమ్ వ్యాలీ బెడ్‌గా క్వ్యూ చిప్ ఇన్ ను వచ్చే 12 నెలల్లో అమరావతిలో ఏర్పాటు చేస్తున్నట్టు- ఉత్తర్వుల్లో తెలిపింది. 2035 నాటికి ప్రపంచ క్వాంటమ్ కేంద్రంగా అమరావతి అభివృద్ధి లక్ష్యంగా పేర్కొంటూ ఉత్తర్వులు ఇచ్చింది. 2026లో ప్రారంభం అయ్యే అమరావతి క్వాంటమ్ అకాడమీ ద్వారా శిక్షణ , ఫెలోషిప్ లు అందజేయాలని నిర్ణయం తీసుకుంది ప్రభుత్వం..

## మామిడి రైతులకు ప్రభుత్వం అండ

అమరావతి,మామిడి కొనుగోలుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రైతులకు నష్టం జరక్కుండా కొనుగోళ్లకు చర్లు చేపట్టింది. ఇందులో భాగంగా మామిడి కొనుగోళ్లపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతిరోజూ సమీక్షిస్తున్నారు. ఇందుకోసం మూడు జిల్లాల కలెక్టరేట్లలో కమాండ్ కంట్రోల్ సెంటర్లను ముఖ్యమంత్రి ఏర్పాటు- చేశారు. 50వేల మందికి పైగా రైతుల నుంచి మామిడి కొనుగోళ్లు చేసేలా చర్యలు తీసుకున్నారు. రైతుల నుంచి పర్లే, ఆగ్రో, కోకోకోలా, పెప్సీ వంటి సంస్థలు.. మామిడి కొనుగోలు చేసేలా సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. మామిడి రైతులను ఆదుకునేందుకు రూ. 130 కోట్లు విడుదల చేయాలని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి సీఎం చంద్రబాబు లేఖ రాశారు. ప్రభుత్వ తీసుకుంటున్న చర్యలు మామిడి రైతుల విషయంలో సత్ఫలితాలను ఇస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాలతో కేజీ రూ. 12 చెల్లించి కొనుగోళు చేస్తున్నారు. ఇప్పటి వరకూ చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో 3,08,261 మెట్రిక్ టన్నుల మేర మామిడిని ట్రేడర్లు, ప్రాసెసింగ్ యూనిట్ల వారు కొనుగోలు చేశారు. మొత్తంగా ఈ సీజన్‌లో 3,75,000 మెట్రిక్ టన్నుల మేర మామిడి ఉత్పత్తి అవుతుందని అంచనా వేశారు. చిత్తూరు జిల్లాలో 1.65 లక్షల మెట్రిక్ టన్నులు, తిరుపతి జిల్లాలో 45 వేల మెట్రిక్ టన్నులు, అన్నమయ్య జిల్లాలో 16,400 మెట్రిక్ టన్నుల మేర మామిడి కొనుగోళ్లు చేశారు. ర్యాంపులు , మండీల ద్వారా మరో 81 వేల మెట్రిక్ టన్నుల మామిడి ఇతర రాష్ట్రాలకు విక్రయాలు జరిగాయి.మొత్తం 50,922 మంది రైతుల నుంచి మామిడి కొనుగోళ్లు అయ్యాయి.మామిడి రైతులకు అండగా ఉన్నామని మ ంత్రిఅచ్చన్నాయుడు అన్నారు. రైతులకు గత ప్రభుత్వం సరిగా ఆదుకోలేదన్నా రు. కానీ తమ ప్రభుత్వం మామిడిన మద్దతు ఇచ్చి కొనుగోలు చేస్తోందని అన్నారు.

## వారసత్వ హక్కుల పత్రంగా రిజిస్ట్రేషన్

అమరావతి,ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులోభాగంగా గ్రామ లేదా వార్డు సచివాలయాల్లో నామమాత్ర ఫీజుతో.. వారసత్వ భూముల సక్సెషన్ రిజిస్ట్రేషన్లు త్వరలో ప్రారంభించేందుకు సర్కారు వడివడిగా అడుగులు వేస్తోంది. చర్యలను వేగవంతం చేసింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నిర్ధారించిన మార్కెట్ విలువ ప్రకారం సదరు ఆస్తి విలువ రూ. 10 లక్షల లోపు ఉంటే.. రూ. 100, అంతకంటే ఎక్కువ ఉంటే రూ. 1000 ఫీజును స్టాంపు డ్యూటీ కింద తీసుకోనున్నారు. ఇప్పటికే దీనిపై సిఎం అంగీకరించారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో గ్రామ లేదా వార్డు సచివాలయాల్లో అనాలోచితంగా ప్రవేశపెట్టిన దస్తావేజుల రిజిస్ట్రేషన్ గందరగోళానికి దారితీసింది. కానీ ప్రస్తుతం వారసత్వ భూములకు రిజిస్ట్రేషన్ చేస్తారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పర్యవేక్షణలో ఈ పక్రియ జరగనుంది. అందుకోసం డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. ఆస్తి యజమానులు మరణించిన అనంతరం వారసులకు సంక్రమించే వాటికి మాత్రమే గ్రామ లేదా వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేస్తారు. తల్లిదండ్రులు మరణించిన అనంతరం వారసత్వంగా వచ్చే ఆస్తులను వారసులు.. తహసీల్దారుకు దరఖాస్తు చేసి, కాగితాలపై రాసుకుంటున్నారు. అయితే వీటికి మ్యుటేషన్లు జరగడం లేదని.. తహసీల్దారు కార్యాలయ సిబ్బంది పలుమార్లు తిప్పుతున్నారంటూ ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. గత ఒక్క ఏడాదిలో 55 వేలకు పైగా ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయి. అదీకాక.. తమ ఆస్తికి ఎందుకు రిజిస్ట్రేషన్ చేయించాలనే ఉద్దేశంతో పలువురు ఉంటున్నారు. దీని వల్ల చనిపోయిన వారి పేర్లు భూముల రికార్డుల్లో అలాగే ఉండిపోతున్నాయి. దీంతో పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. గ్రామ లేదా వార్డు సచివాలయాల్లో మరణ ధృవీకరణ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. యజమాని మరణించిన అనంతరం వచ్చిన ఆస్తులను వారసులు భాగాలుగా చేసుకుని లిఖితపూర్వకంగా ఏకాభిప్రాయంతో వస్తే.. గ్రామ లేదా వార్డు సచివాలయాల్లో పని చేసే డిజిటల్ అసిస్టెంట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేస్తారు. సచివాలయాల్లో.. అది కూడా నామమాత్రపు ఫీజులతో రిజిస్ట్రేషన్ చేయడం ద్వారా వారసులు ముందుకు వస్తారని ప్రభుత్వం అంచనా వేస్తుంది. ఇక రిజిస్ట్రేషన్ చేయడం వల్ల భూముల రికార్డుల్లో వివరాలు నమోదు ఆటోమేటిగ్గా జరుగుతుంది. ఆ వెంటనే ఈ పాస్ బుక్ జారీ అవుతుంది. ఆ క్రమంలో వారసుల వద్ద నుంచి ఈ కేవైసీ సైతం తీసుకుంటారు. ఈ అంశంపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించి.. ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ శాఖ నుంచి ఈ విధానం అమలుపై మార్గదర్శకాలు రానున్నాయి. అందుకోసం రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ చర్యలు తీసుకుంటుంది. అందుకోసం రెండు, మూడు మాసాల సమయం పట్టనుందని తెలుస్తోంది.

### చిన్నారి హత్యను ఛేదించిన పోలీసులు

జగిత్యాల, జగిత్యాల జిల్లా కోరుట్లలో చిన్నారి హితీక్ష (5) హత్య కేసులో మిస్టరీ వీడింది. చిన్నమ్మ మమతనే చిన్నారిని హతమా÷–చినట్లు పోలీసులు నిర్ధరించారు. తోడికోడలిపై కోపంతోనే ఐదేళ్ల చిన్నారి గొంతు కోసి ప్రాణాలు తీసినట్లు చెప్పారు. అనంతరం మృతదేహాన్ని బాత్రూమ్‌లో పడేసినట్లు– గుర్తించారు. నిందితురాలిని అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కోరుట్లలోని స్థానిక ఆదర్శనగర్ కాలనీలో ఇంటి బయట ఆడుకుంటున్న చిన్నారి కొద్దిసేపటి తర్వాత సమీపంలోని ఓ ఇంటి స్నానాల గదిలో విగతజీవిగా కనిపించడం తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. మొదట ఆ ఇంటి యజమానిపై పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. అతడికి ఫోన్ చేయగా తాను వరంగల్ జిల్లాలో ఉన్నట్లు– చెప్పారు. స్థానికంగా ఉన్న వారే హత్యకు పాల్పడి ఉండచ్చన్న కోణంలో దర్యాప్తు చేపట్టారు. శనివారం రాత్రి 11 గంటలకు ఎస్పీ అశోక్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని వేకువజామున 4 గంటల వరకు క్షుణ్ణంగా పరిశీలించారు. మృతురాలి ఇంటి వద్ద ఉన్న ఓ సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించి, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు జరిపారు. జాగిలాలు ఘటనా స్థలం నుంచి చిన్నమ్మ ఇంటికే వెళ్లి ఆగాయి. ఆ దిశగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు చిన్నారిని ఆమె చిన్నమ్మే హత్య చేసినట్లు నిర్ధరించారు.

## రేసులో ఉన్న ఆశావహులెవరు..

హైదరాబాద్, సాధ్యమైనంత తొందరగా లోకల్ బాడీ పోల్స్ నిర్వహించాలి. కానీ అంతకంటే ముందే అన్ని పదవులు భర్తీ చేయాలని ప్లాన్ చేస్తోంది రేవంత్ సర్కార్. పార్టీ పదవులతో పాటు ప్రభుత్వంలోని పోస్టులన్నీ ఫిలప్ చేసేందుకు రంగం సిద్ధమైందట. ఈ నెలాఖరులోపు అన్ని పోస్టుల పంపకాలు పూర్తి చేయాలని..స్వయంగా ఏఐసీసీ చీఫ్ మల్లిఖార్జున ఖర్గేనే డెడ్ లైన్ పెట్టారట. దీంతో కాంగ్రెస్‌లో పదవుల పంపకాలపై ఆశలు చిగురిస్తున్నాయి. ఇంతకీ ఏయే పోస్టులను భర్తీ చేయబోతున్నారు? పదవుల రేసులో ఉన్న ఆశావహులెవరు?ఏడాదిన్నరగా ఎదురు చూస్తున్న కాంగ్రెస్ నేతల ఆశలు నెరవేరబోతున్నాయి. ఇటు పార్టీ పదవులు, అటు ప్రభుత్వంలోని కార్పొరేషన్ పదవులను భర్తీ చేయాలని కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించింది. నామినేటెడ్ పదవుల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి పదే పదే మంత్రులకు సూచిస్తున్నారు. ఉమ్మడి జిల్లాల ఇంచార్జ్ మంత్రులు చొరవ తీసుకుని..పార్టీలో పనిచేసిన వారికి నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని పలుమార్లు చెబుతూ వచ్చారు. లేటెస్ట్‌గా గాంధీభవన్‌లో జరిగిన పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ, ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశాల్లో పాల్గొన్న పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశారట. అంతేకాదు పోస్టుల భర్తీపై డెడ్ లైన్ కూడా పెట్టారంటున్నారు. ఈ నెలాఖరులోపు నామినేటెడ్ పోస్టుల జాబితా సిద్ధం చేసి పంపాలని సీఎం రేవంత్ రెడ్డికి చెప్పిన ఖర్గే..అందుకోసం పీసీసీ చీఫ్ బాధ్యత తీసుకొని పనిచేయాలని ఆదేశించారట. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో లోకల్ బాడీ ఎన్నికలకు నిర్వహించాలని భావిస్తోంది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో సెప్టెంబర్‌లోగా లోకల్ బాడీ ఎన్నికలను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే ఆగస్ట్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టేందుకు రంగం సిద్ధం అవుతోందట. అయితే ఈ లోపు పార్టీ నాయకత్వాన్ని ఎన్నికల సమరానికి రెడీ చేస్తోంది కాంగ్రెస్ సర్కార్. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావొస్తున్నా ఇంకా నామినేటెడ్ పోస్టులు పూర్తిస్థాయిలో భర్తీ చేయకపోవడంతో నేతలు నారాజ్‌లో ఉన్నారు. దీంతో సెకండ్ గ్రేడ్ లీడర్లను సంతృప్తి పరిచేందుకు ఖాళీగా ఉన్న నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలనుకుంటున్నారట. ప్రభుత్వం ఏర్పడిన మొదట్లో 38 కార్పొరేషన్ ఛైర్మన్ పోస్టులను భర్తీ చేసిన సీఎం రేవంత్..మిగిలిన పదవులను కూడా పంచేయాలనుకుంటున్నారు. అలాగే మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, దేవాలయ కమిటీలను భర్తీ చేయాలని చూస్తోంది ప్రభుత్వం. అన్ని కార్పొరేషన్ ఛైర్మన్లు, కమిటీలు, డైరెక్టర్లు కలిపి దాదాపు వంద మంది నేతలను అకామిడేట్ చేయాలని ప్లాన్ చేస్తున్నారట. ఇక మంత్రిపదవి రాని వారిని క్యాబినెట్ ర్యాంకున్న కార్పొరేషన్లకు ఛైర్మన్లుగా నియమించాలని పార్టీ నాయకత్వం ఆలోచన చేస్తోంది. అందుకు అనుగుణంగా మల్లికార్జున ఖర్గే స్వయంగా మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్న ఆరుగురు నేతలను పిలిచి మీకు బెర్త్ కల్పించలేమని చెప్పేశారు. ప్రభుత్వ చీఫ్ విప్ పదవిని ప్రేమ్‌సాగర్ రావుకు, ఆర్టీసీ లేదా ఫ్యూచర్ సిటీ కార్పొరేషన్‌ను మల్‌రెడ్డి రంగారెడ్డికి, రామ్మోహన్‌రెడ్డి, బాలునాయక్, ఆదిశ్రీనివాస్, సుదర్శన్‌రెడ్డిలకు కూడా పలు కార్పొరేషన్ పోస్టులను ఆఫర్ చేశారట.

# అమెరికాకు తల ఒగ్గితే భవిత అయోమయం



వాషింగ్టన్,అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 2025 జులై 8వ తేదీ నాటికి అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి భారతదేశానికి గడువు విధించిన నేపథ్యంలో వాణిజ్యమంత్రి పీయూష్ గోయల్ నేతృత్వంలోని భారత బృందం, జేమీసన్ గ్రియర్ నేతృత్వంలోని అమెరికా బృందంతో వాషింగ్టన్‌లో 2 రోజుల చర్చలు జరిపింది. గోయల్ రెండు రోజుల క్రితం తిరిగి భారత దేశానికి వచ్చినప్పటికీ, వాణిజ్య కార్యదర్శి ఇంకా అమెరికాలో ఉన్నసమయంలో ట్రంప్ ఏకపక్షంగా భారతదేశంతో ఒక పెద్ద వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించాడు. ఇందులో భారతదేశాన్ని మరింత తెరవాలని స్పష్టమైన సందేశం ఉంది. అయితే వివరాలు ఇంకా వెల్లడించలేదు. ఇది ట్రంప్ 2025 మే 10న ప్రకటించిన అమెరికా –మధ్యవర్తిగా ఇండో –పాక్ కాల్పుల విరమణ, దానితో అనుసంధానించిన అమెరికా– భారత వాణిజ్య ఒప్పంద ప్రకటన కొనసాగింపే. ఇది మరోసారి ఆర్‌ఎస్‌ఎస్ ప్రేరేపించిన మోడీ పాలన అమెరికా సామ్రాజ్యవాదానికి చేసిన దౌర్భాగ్యకర నయా వలసవాదానికి తలవంచే విధానాన్ని బయటపెడుతోంది. 2025 ఏప్రిల్ 2న ట్రంప్ ప్రపంచవ్యాప్తంగా రక్షణాత్మక షరతులు, పరిమితులు విధిస్తూ జారీ చేసిన కార్యనిర్వాహక ఆదేశంలో భాగంగా ఉక్కు, అల్యూమినియంలపై 26% పన్నులు విధించడమే కాకుండా, భారత్‌లో తమ మార్కెట్‌కు అడ్డంకులు లేని ప్రవేశం కోసం డిమాండ్ చేశారు. ప్రపంచంలోని తూర్పున చైనా నుండి పశ్చిమ యూరప్, కెనడా వరకు పలు దేశాలు వెంటనే ప్రతిచర్యలు ప్రకటించాయి. లాటిన్ అమెరికా దేశాలు, ఆఫ్రికా దేశాలు కూడా ఈ ఏకపక్ష ట్రంప్ పన్నుల విధింపునకు వ్యతిరేకంగా గళమెత్తాయి. చైనా కౌంటర్ (ప్రత్యర్థిగా పన్నులుగా విధానానికి) టారిఫ్‌లకు ప్రతిచర్యగా ట్రంప్ చైనాతో రెండు దఫాల చర్చలతర్వాత వాణిజ్య ఒప్పందానికి వెళ్లాల్సి వచ్చింది. మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ వంటి మాటలు పలికే మోడీ మాత్రం ట్రంప్ ఏకపక్షంగా బెదిరించే పద్ధతిలో పన్నులను విధించటం గురించి ఏమీ మాట్లాడకపోవడం ఆశ్చర్యకరంగా ఉంది. ఇప్పుడు ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంలో భారతదేశంలో తక్కువ వేతనంతో పని చేసే రంగాలైన టెక్స్‌టైల్, రత్నాభరణాలు, చర్మవస్తువులు, వస్త్రాలు, ప్లాస్టిక్, రసాయనాలు, రొయ్యలు, నూనెగింజలు, ద్రాక్ష, అరటిపండ్లపై అదనపు 26% పన్నుల నుండి పూర్తి మినహాయింపు కోసం వేడుకుంటుంటే, అమెరికా మాత్రం అధునాతన సాఫ్ట్‌వేర్‌లు, పరిశ్రమల వస్తువులు, ఆటో లు, ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాలు, పెట్రో రసాయన ఉత్పత్తులు, వైన్, పాల ఉత్పత్తులు, ఆపిల్స్, ఇంతటితోనే కాకుండా జన్యుపరిణామం చేసిన పంటలపై డ్యూటీ మినహాయింపులు కోరుతోంది. ఈ ఒప్పందం ద్వారా 2025లో 191 బిలియన్ డాలర్లుగా ఉన్న ఇరు దేశాల వాణిజ్యాన్ని 2030 నాటికి 500 బిలియన్ డాలర్లకు పెంచాలన్నది లక్ష్యం. ఈ కొత్త ఒప్పందాన్ని 2025 జులై 8న ప్రకటించే అవకాశం ఉంది. స్వతంత్ర పరిశీలకుల ప్రకారం ట్రంప్ భారతదేశాన్ని మరింతగా తెరవాలి 'ఓపెన్ అప్ ఇండియా' అనేది 'స్టార్టప్ ఇండియా' చొరవను సూచిస్తుంది. ఇది స్టార్టప్‌లు, ఆవిష్కరణలకు మద్దతు ఇచ్చే పర్యావరణ వ్యవస్థను పెంపొందించే లక్ష్యంతో భారత ప్రభుత్వం ప్రధాన కార్యక్రమం. వ్యవస్థాపకత, ఆవిష్కరణలను ప్రోత్సహించడం ద్వారా భారతదేశాన్ని ఉద్యోగ సృష్టికర్తల దేశంగా మార్చడం దీని లక్ష్యం. ఈ చొరవ పన్ను మినహాయింపులు, నిధులకు సులభమైన ప్రాప్యత, మేధో సంపత్తి రక్షణకు మద్దతు వంటి వివిధ ప్రయోజనాలను అందిస్తుంది. కొత్తప్రకటన ఆధారంగా మోడీ పాలన అమెరికా ఉత్పత్తుల కోసం ఎర్రతివాచి పరచడానికి సిద్ధమవుతోంది. 2020 నివేదిక ప్రకారం ప్రపంచ బ్యాంకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఇండెక్స్‌లో భారతదేశం 190 దేశాలలో 63వ స్థానంలో ఉంది. 2014లో 142వ స్థానం నుండి ఇది గణనీయమైన మెరుగుదల. 2021లో ప్రపంచ బ్యాంకు ఈ నివేదికను నిలిపివేసింది. కానీ అప్పటి వరకు భారతదేశం సాధించిన పురోగతి నియంత్రణ సంస్కరణలకు, మరింత వ్యాపార అనుకూల వాతావరణాన్ని సృష్టించడంలో దాని నిబద్ధతను హైలైట్ చేసింది. ఫలితంగా భారత ఔషధ పరిశ్రమపై తీవ్ర ప్రభావంపడడం, డిజిటలైజేషన్, కృత్రిమ మేధ (ఎఐ)వంటి సాంకేతిక విధానాలలో భారత్ కష్టపడి సాధించిన పురోగతిని దెబ్బతీసే పరిస్థితులు ఏర్పడుతాయి. సోయాబీన్, మొక్కజొన్న, ఆపిల్స్, పాలు మొదలైన వాటిపై అమెరికా ఒత్తిడి వల్ల వచ్చే కొత్త పన్ను మినహాయింపుల మొదటగా నష్టపోయేది,బలిపశువులు అయ్యేది రైతాంగమే. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై తక్కువ పన్నులు, జిఎం –(జెనిటికల్లి మాడిఫైడ్ –జన్యుపరంగా మార్పిడి చేయబడింది– ఉదాహరణకు బిటి విత్తనాలు) విత్తనాల స్వేచ్ఛా ప్రవేశం, అమెరికా అగ్రిబిజినెస్, బహుళజాతి కంపెనీల (ఎంఎన్‌సిల) స్వేచ్ఛా విస్తరణ భారత వ్యవసాయానికి ఘోర విపత్తుకావడం ఖాయం. ఇది 2020 సెప్టెంబర్‌లో ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) ఆదేశాల ప్రకారం కొవిడ్ సమయంలో నరేంద్ర మోడీ తీసుకొచ్చిన మూడు రైతు చట్టాలను గుర్తుకు తెస్తోంది. అదే విధంగా రెండు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు అమెరికా –భారత పౌర అణు ఒప్పందాన్ని (సివిల్ న్యూక్లియర్ ఒప్పందాన్ని)కూడా ఈ వాణిజ్య ఒప్పందానికి అనుబంధంగా కలిపారు. దీనిలో భాగంగా అణుశక్తి చట్టాన్ని( అటామిక్ ఎనర్జీ చట్టం) సవరించడం, ప్రైవేట్ పెట్టుబడులకు అనుమతులు ఇవ్వడం, న్యూక్లియర్ ప్రమాదం జరిగితే కంపెనీల బాధ్యతను తగ్గించేలా సివిల్ లయబిలిటీ ఫర్ న్యూక్లియర్ డ్యామేజ్ (అణు నష్టానికి పౌర బాధ్యత చట్టాన్ని–) చట్టాన్ని సవరించడం మోడీ ప్రభుత్వం ప్రతిజ్ఞాబద్ధమైంది. 2025 బడ్జెట్‌లో విదేశీ న్యూక్లియర్ సంస్థలకు చిన్న మాడ్యులర్ రియాక్టర్లు నిర్మించడానికి మార్గం ఇచ్చినది. సారాంశంగా చెప్పాలంటే మోడీ పాలనకు ఉన్న అమెరికా సామ్రాజ్యవాద విధేయతే ఈ ట్రంప్ విధానాలకు లొంగిపోవడంలో ప్రతిబింబిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ట్రంప్ విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సమయంలో రైతులు, కార్మికులు, అశేష భారత ప్రజల జీవనాధారాలను తృణప్రాయంగా విస్మరించి అమెరికా సామ్రాజ్యవాదానికి బానిసగా మారటం అత్యంత దురదృష్టకరం.

## యువతని చంపి యువకుడి ఆత్మహత్యాయత్నం

హైదరాబాద్, ప్రేమ వ్యవహారం ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. తనను దూరంగా పెడుతోందన్నకోపంతో యువతని ప్రేమికుడు కత్తితో దారుణంగా హత్యచేశాడు. అనంతరం తనూ కత్తితో కోసుకున్నాడు. ఈ ఘటనలో యువతి ప్రాణాలు కోల్పోగా.. యువకుడు మృత్యువుతో పోరాడుతున్నాడు. ఈ ఘటన హైదరాబాద్ శివారులోని పటాన్‌చెరు డివిజన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రామచంద్రాపురం పీఎస్ పరిధిలోని బండ్లగూడ బాలాజీ నగర్‌లో యువతి రమ్య (23) కుటుంబసభ్యులు 8 ఏళ్లుగా నివాసం ఉంటున్నారు. రమ్య డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. గత మూడేళ్లుగా ఆ యువతి, ప్రవీణ్ అనే యువకుడు ప్రేమించుకుంటున్నారు. కులాలు వేరు కావడంతో వారి వివాహానికి యువతి తల్లిదండ్రులు అంగీకరించలేదు. ఈ నేపథ్యంలోనే గత కొంత కాలంగా రెండు కుటుంబాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం యువతి తల్లిదండ్రులు పనికి వెళ్లిన సమయంలో ప్రవీణ్.. రమ్య ఇంటికి వచ్చాడు. పనులు ముగించుకొని యువతి తల్లిదండ్రులు ఇద్దరూ భోజనానికి ఇంటికి వచ్చే సరికి రమ్య, ప్రవీణ్ రక్తపు మడుగులో పడి ఉన్నారు. ప్రవీణ్ కొన ఊపిరితో ఉండడంతో బీరంగూడలోని ప్రైవేటు– ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, క్లూస్ టీ–మ్ సాయంతో వివరాలు సేకరించారు. యువతిని హత్య చేసిన అనంతరం యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడా? ఇంకేమైనా కారణం ఉందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

## తప్పులు లేకుండా ఓటర్ల జాబితా

విజయవాడ,దోషరహిత ఓటర్ల జాబితా రూపొందించడంలో బూత్ స్థాయి అధికారులదే కీలక పాత్ర అని పశ్చిమ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ ఏ రవీంద్రరావు అన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా, చీఫ్ ఎలక్టరల్ అధికారి, ఆదేశాల మేరకు సోమవారం 79–విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించిన బూత్ లెవెల్ అధికారులకు నగరంలోని పొట్టి శ్రీరాములు చల వాది ఇంజనీరింగ్ కాలేజీలో ఈనెల 11వ తేదీ వరకు నిర్వహించే శిక్షణా తరగతులను ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఇఆర్వో) ఏ రవీంద్రరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటిష్టమైన ప్రజాస్వామ్య వ్యవస్థకు దోషరహిత ఓటర్ల జాబితా కీలకమన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతను ఓటర్లుగా నమోదు చేయాలని ,ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు లో ఎన్నికల కమిషన్ నిబంధనలను పాటించాలన్నారు. జాబితాలో మరణించినవారు, వలస వెళ్లిన వారి ఓట్ల తొలగింపు కు సంబంధించి క్షేత్రస్థాయిలో ఒకటికి రెండుసార్లు పూర్తిస్థాయి విచారణ అనంతరమే నిబంధన ల ప్రకారం చర్యలు తీసుకోవలసి ఉంటు–ందన్నారు. జాబితా రూపొందించడంలో ఎన్నికల నియమావళి పాటించవలసి ఉంటు–ందని అన్నారు. రోజుకు 50 మంది బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని ఇఆర్వో ఏ. రవీంద్ర రావు అన్నారు. శిక్షణ కార్యక్రమంలో ఎలక్షన్ డిటి షేక్. ఇస్మాయిల్ , బిఎల్ ఓలు హాజరయ్యారు.

## వ్యవసాయాభివృద్ధికి ఆదుకోవాలని వినతి

న్యూఢిల్లీ,గత వైకాపా ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పట్టించుకోలేదని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. కేంద్ర పథకాలను సైతం గాలికి వదిలేసిందన్నారు. సోమవారం దిల్లీలో పర్యటించిన ఆయన.. కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో భేటీ– అయ్యారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి కేంద్రం నుంచి సహకారం కావాలని కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఏపీలో దాదాపుగా 64 శాతం మంది వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అందుకు ప్రభుత్వాలు ఈ రంగానికి ప్రాధాన్యత ఇస్తున్నాయి. కానీ, గత వైకాపా ప్రభుత్వం మాత్రం వ్యవసాయరంగాన్ని పూర్తిగా గాలికి వదిలేసింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్యక్రమాలను కూడా వినియోగించుకోకపోవడం వల్ల రాష్ట్రంలో వ్యవసాయ రంగం కుదేలైంది. మళ్లీ దానిని గాడిన పెట్టాలంటే కేంద్రం సహకరించాలని కోరినట్లు అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు మండిపడ్డారు. పరామర్శల పేరుతో వైఎస్ జగన్ అనుసరిస్తున్న వైఖరిని ఆయన తప్పు పట్టారు. మళ్లీ ఓదార్పు యాత్రలంటూ లా అండ్ ఆర్డర్ సమస్యలు తెచ్చే విధంగా చూస్తున్నారంటూ వైఎస్ జగన్‌పై నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ లేకుండా చేయాలనే ప్రయత్నం జగన్ చేస్తున్నారన్నారు. డ్రగ్స్, గంజాయి వాడే వారిని పరామర్శించడానికి వెళ్లి రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. ఎవరైనా చనిపోతే ఏడాది తర్వాత పరామర్శకు వెళ్తారా? అంటూ వైఎస్ జగన్ రెంటపాళ్ల పర్యటనపై ఆయన సందేహం వ్యక్తం చేశారు. ఒక్క ఏడాది పాలనలోనే ఆంధ్రప్రదేశ్‌లో రూ. 10 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడదని గుర్తు చేశారు. ప్రతి అంశంలో సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించి.. రైతులతోపాటు– ప్రజలకు సహాయం చేస్తున్నారని వివరించారు. ఆ క్రమంలో పొగాకు కొనుగోలు చేస్తున్నామని.. అలాగే మామిడి రైతులకు సైతం సహాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. అయితే బంగారు పాలెం వ్యవసాయ మార్కెట్ వెళ్తున్నామని వైసీపీ నేతలు అంటున్నారని.. అక్కడికి వెళ్ళి ఏం చేస్తావంటూ ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌ను ఈ సందర్భంగా ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ పర్యటన కోసం 800 బస్సులు, 2 వేల కార్లతోపాటు– ఏడు జిల్లాల నుంచి రైతులను తరలించేందుకు సన్నాహకాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల పేర్లు చెప్పి లా అండ్ ఆర్డర్ లేదని ప్రపంచానికి తెలియజేసే నీచమైన ప్రయత్నానికి వైఎస్ జగన్ తెర తీశారన్నారు. రైతులను మార్కెట్‌కు తీసుకు వెళ్లాలని.. అంతేకానీ ఇలా సమస్యలు సృష్టించడం ఏమిటని వైఎస్ జగన్‌ను ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు సూటిగా ప్రశ్నించారు. ఇది బల ప్రదర్శన కాదో చెప్పాలంటూ వైఎస్ జగన్‌ను ఆయన డిమాండ్ చేశారు. శాంతి భద్రతల సమస్యలు సృష్టించేందుకు ఈ విధంగా వ్యవహరిస్తున్నారంటూ మండిపడ్డారు. గత ఐదేళ్లలో ప్రజల సమస్యలు ఒక్కటి కూడా వినలేదంటూ మాజీ సీఎం వైఎస్ జగన్ వైఖరిని నిలదీశారు. పార్టీ జెండా తీసే పరిస్థితి వచ్చే సరికి ఇవన్నీ చేస్తున్నారంటూ వైసీపీ అధినేతపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు మిర్చి రైతుల ధర్నాకు వెళ్లి.. మిర్చి బస్తాలు దొంగిలించారని విమర్శించారు. కూటమి సర్కార్ పాలనలో ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. మంగళవారం మార్కెట్‌కు వచ్చే వైఎస్ జగన్‌ను నిలదీయాలని రైతులకు ఆయన పిలుపు నిచ్చారు. అందుకోసం ప్రజల్లో చైతన్యం రావాల్సి ఉందన్నారు.

# కారుచీకట్లో బ్రిక్స్ కాంతిరేఖ




న్యూఢిల్లీ,ఒంటరి ప్రయాణంకన్నా సమష్టిగా ముందడుగు వేయటం ఎప్పుడూ మంచిదే. ఒకప్పుడు అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంకు వంటి సంస్థల ద్వారా ప్రపంచ దేశాలను శాసించిన సంపన్న రాజ్యాలు ఇప్పుడు నేరుగా ఆ పని చేయాలనుకుంటున్నాయి. తమకు ఇన్నాళ్లూ అన్యాయం జరిగిపోయిందని ఆక్రోశిస్తూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సాగిస్తున్న 'అధిక సుంకాల' బెదిరింపు ఆ కోవ లోనిదే. ఈ విషయంలో ట్రంప్ జయాపజయాలను చూశాక, ఇప్పుడు ఆయన్ను ప్రతిఘటిస్తున్న ఇతర సంపన్న రాజ్యాలు సైతం ఆ దోవకే పోతాయి. ఎవరికి వారు ద్వైపాక్షిక ఒప్పందాల్లో అధిక సుంకాల కోసం ఒత్తిళ్లు తెస్తారు. ఇలాంటి వర్తమాన పరిస్థితుల్లో బ్రిక్స్ వంటి ప్రాంతీయ కూటముల అవసరం, ప్రాముఖ్యత గతం కన్నా ఎంతో పెరిగాయి. ముఖ్యంగా సహజ వనరులు పుష్కలంగా వున్నా పేదరికంలో మగ్గుతున్న దక్షిణ దేశాల స్వరం వినిపించటానికి బ్రిక్స్ తోడ్పడుతోంది. ఆదివారం ప్రారంభమైన రెండు రోజుల బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు ముందు ఈ నెల 2నుంచి ప్రధాని నరేంద్ర మోదీ అయిదు దక్షిణార్ధ గోళ దేశాల పర్యటన ప్రారంభించారు. ఘనా, ట్రినిడాడ్, టుబాగో, అర్జెంటీనా దేశాల్ని ఇప్పటికే సందర్శించగా... ఈ శిఖ రాగ్ర సదస్సు నిర్వహించిన బ్రెజిల్‌లో మంగళవారం కూడా పర్యటించి ఆ మరునాడు నమీబియా వెళ్తారు. ఆ దేశాల సమస్యల్ని స్వయంగా అవగాహన చేసుకోవటానికి ఈ పర్యటన దోహదపడింది. అందుకే... బ్రిక్స్ సదస్సులో ఆయన దక్షిణార్ధ గోళ దేశాల తరఫున బలంగా స్వరం వినిపించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఎంతగానో తోడ్పడుతూ కూడా ఆ దేశాలు వివక్షను ఎదుర్కొంటున్న వైనాన్నీ, వనరుల పంపిణీ, అభివృద్ధి, భద్రత వంటి అంశాల్లో వాటిని విస్మరిస్తున్న ధోరణినీ ప్రస్తావించారు. అంతర్జాతీయ వేదికల్లో వాటికి స్థానం లేకపోవటాన్ని ఎత్తి చూపారు. అంతక్రితం మాటెలా ఉన్నా కనీసం బ్రిక్స్ ఆవిర్భావం తర్వాతైనా దక్షిణార్ధ గోళ దేశాల్లో పర్యటించి వాటితో మెరుగైన సంబంధాలు ఏర్పర్చుకోవాలని గత ప్రధానులు అనుకోలేదు. మన ప్రధానొకరు ఘనా పర్యటించటం ఇదే తొలిసారైతే, అర్జెంటీనాకు వెళ్లటం 57 ఏళ్ల తర్వాత మొదటిసారి. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనాలతో తొలుత ఏర్పడిన బ్రిక్స్‌లో దక్షిణాఫ్రికా చేరగా, తాజాగా చేరిన ఇండొనేసియాతో కలుపుకొని మొత్తం సభ్యదేశాలు 11 అయ్యాయి. భాగస్వామ్య దేశాలు తొమ్మిది, ఆహ్వానిత దేశాలు ఎనిమిది వుండగా, రియో డీ జెనీరో సదస్సుకు ఏడు అంతర్జాతీయ సంస్థల చీఫ్‌లు హాజరయ్యారు. సంస్థ పరిధి విస్తృతం అయ్యేకొద్దీ దాని బాధ్యతలు పెరుగుతాయి. ఆ మేరకు అంతర్జాతీయ వ్యవహారాల్లో దాని ప్రభావం కూడా ఎక్కువవుతుంది. అయితే అందరిదీ ఒక్క గొంతు అయినప్పుడే, ఉమ్మడి ప్రయోజనాల కోసం సభ్య దేశాలన్నీ అంకిత భావంతో పనిచేసినప్పుడే అది ప్రభావవంతమైన పాత్ర పోషించగలుగుతుంది. ప్రపంచం శరవేగంగా మారుతోంది. కరోనా మహమ్మారి విరుచుకు పడ్డాక సంపన్న రాజ్యాలు సైతం కుదేలయ్యాయి. జననష్టంతో పాటు లాక్‌డౌన్ కారణంగా చాలా ఆర్థిక వ్యవస్థలు కుప్ప కూలాయి. అమెరికాలో డోనాల్డ్ ట్రంప్ రెండోసారి వచ్చాక పాత విధానాలకు పాతరేసి కొత్త కొత్త నిబంధనలతో ప్రపంచ దేశాలను ఊపిరాడకుండా చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆర్థిక,సాంకేతిక, విద్యారంగాల్లో పరస్పరం సహకారం పెంచుకోవటానికీ, ఎదగటానికీ బ్రిక్స్ వంటి సంస్థలు దోహదపడతాయి. ప్రపంచ సంపద పెరగాలన్నా, ఆ సంపద సక్రమంగా పంపిణీ కావా లన్నా ఇటువంటి సంస్థల అవసరం ఎంతో ఉంటుంది. ఉగ్రవాదం తరచు కోరలు చాస్తున్న తీరుపై బ్రిక్స్ ఆందోళన వ్యక్తం చేయటంతోపాటు ఆ విషయంలో ద్వంద్వ ప్రమాణాలను పాటిస్తున్న దేశాలను తూర్పారబట్టడం చైనా వంటి దేశాల కళ్లు తెరిపించాలి. ఉగ్రదాడులు జరిగిన ప్రాంతాన్ని బట్టి, ఆరోపణలొచ్చిన సంస్థలను బట్టి భిన్న వైఖరుల్ని తీసుకుంటున్న చైనా వంటి దేశాలకు బ్రిక్స్ డిక్లరేషన్ చెంపపెట్టు. పాకిస్తాన్‌లో ఆశ్రయం తీసుకుంటూ ఉగ్ర కార్యకలాపాలు నిర్వహిస్తున్న జైషే మహమ్మద్ చీఫ్ మసూద్ అజర్ వంటివారిపై చర్య తీసుకోవాలని భద్రతామండలిలో వచ్చిన తీర్మానాన్ని వీటో చేసిన ఘనత చైనాది. ఇలాంటి ధోరణి వల్ల ఉగ్రవాదం బలపడుతుందే తప్ప తగ్గదు. తమ వరకూ రాలేదని, తమకు నష్టం జరగలేదని భావించి ఉగ్రవాదంపై ఉదాసీన వైఖరి అవలంబిస్తే అలాంటి దేశాలు సైతం నష్టపోక తప్పదు. పాకిస్తాన్‌లో వివిధ ప్రాజెక్టుల నిర్మాణాల్లో పాలుపంచుకుంటున్న చైనా టెర్రరిస్టుల నుంచి సమస్యల్ని ఎదుర్కొనటం దీన్నే రుజువుచేస్తోంది. సంపన్న రాజ్యాల కూటమి జీ–7 సదస్సుకు గత నెలలో పరిశీలక హోదాలో హాజరైన మన దేశం ఇప్పుడు బ్రిక్స్‌లో ప్రధాన పాత్ర పోషించింది. సదస్సుకు రష్యా, చైనా అధినేతలు వేర్వేరు కారణాల వల్ల రాలేదు. రష్యా అధినేత పుతిన్‌పై ఉక్రెయిన్ దురాక్రమణకు సంబంధించి అంత ర్జాతీయ న్యాయస్థానంలో నేరారోపణలు ఉండటంతో రాలేక, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొ నాల్సి వచ్చింది. ఇక షీ జిన్‌పింగ్ తరఫున ప్రతినిధి హాజరయ్యారు. వచ్చే ఏడాది బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు తీసుకోవాల్సిన భారత్‌కు ఒకరకంగా ఇప్పటినుంచే బాధ్యతలు మొదలైనట్టు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఒక రకమైన అనిశ్చితి అలుముకుంది. ఇది మళ్లీ జవసత్వాలు పుంజుకోవాలంటే ఘర్షణ వాతావరణం సమసిపోవాలి. సామరస్య వాతావరణం ఏర్పడాలి. అందుకు బ్రిక్స్ ఆచరణ దోహదపడాలి.

## గ్రామాల్లో పచ్చదనం నెలకొనాలి

కామారెడ్డి, వాతావరణంలో అసమానతలు తొలగించేందుకు పర్యావరణాన్ని రక్షించడంలో మొక్కలు పెంపకం తప్పనిసరి అని కాంగ్రెస్ నేత, మాజీమంత్రి షబ్బీర్ అలీ తెలిపారు. పర్యావరణ హితం కోసం మొక్కలు నాటడడంలో ప్రతి ఒక్కరూ మమేకం కావాలని అన్నారు. ఇది లాభాపేక్ష లేని కార్యక్రమంగా చూడాలన్నారు. వర్షాలు సకాలంలో రావాలన్నా ప్రజలంతా మొక్కల పెపంపకంలో భాగస్వాములు కావాలన్నారు. అధికారులు,ప్రజాప్రతినిధులు ఏదైనా గ్రామాన్ని దత్తతగా భావించి పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని అన్నారు. వ్యాపార దృక్పథంతో చూడకుండా సమాజానికి ఏదైనా పది కాలాల పాటు మేలు కలిగేలా ఉండే ఇలాంటి కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న వనమహోత్సవం కార్యక్రమంలో పాల్గొని భావితరాలకు పచ్చదనం, ఆరోగ్యకర సమాజాన్ని అందించాలని అన్నారు. నేషనల్ హైవే అథారిటీ వారికి అటవీ శాఖ వారు మొక్కలు నాటడం చేపడుతారని తెలిపారు.

# కాటిపల్లి సైలెంట్.. అసలు కారణాలు ఇవేనా?



హైదరాబాద్,రెండు పార్టీల అగ్రనేతలను ఓడించిన లీడర్ ఆయన. రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో పాపులరైన ఆ నేత.. గత కొన్ని రోజులుగా చాలా సైలెంట్‌గా ఉంటున్నారట. పార్టీ కార్యక్రమాల్లోనూ ఓ మాదిరిగానే పాల్గొంటున్నారట. ఇలాంటి పరిస్థితుల్లోనే.. ఇటీవలె పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా రామచంద్రరావు బాధ్యతలు స్వీకరించిన కార్యక్రమానికీ హాజరు కాలేదట. అసలు ఎందుకీ పరిస్థితి..? కమలంలో ఏం జరుగుతోంది..?కాటిపల్లి వెంకటరమణారెడ్డి. కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే. 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు ఆయన రేంజ్ ఒకలా ఉంటే.. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత మరోలా మారిపోయింది. నిజమే.. ఇందులో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు కాటిపల్లి. అయితే.. ఇదేదో సాధారణ విక్టరీ అయ్యుంటే ఇంతగా మాట్లాడుకోవాల్సిన అవసరం ఉండేది కాదు. హోరాహోరీగా సాగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి అసెంబ్లీ స్థానం నుంచి హేమాహేమీలైన అభ్యర్థులు బరిలో దిగారు. బీఆర్ఎస్ నుంచి గులాబీ బాస్ కేసీఆర్ పోటీ చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి రేవంత్ రెడ్డి బరిలో దిగారు. కానీ, వీరిద్దరిపై పైచేయి సాధించి నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేశారు కాటిపల్లి వెంకటరమణారెడ్డి.

**రాష్ట్రస్థాయి కార్యక్రమాలకు దూరంగా వెంకటరమణారెడ్డి**

జెయింట్ కిల్లర్‌గా కామారెడ్డి నుంచి విజయం సాధించడంతో కాటిపల్లి పేరు రాష్ట్ర వ్యాప్తంగా మార్మోగింది. అలాంటి నేత మొదట్లో బాగానే ఉన్నా.. గత కొంత కాలంగా ఆయన పేరు గట్టిగా విన్పించడం లేదన్న కామెంట్లు వస్తున్నాయి. పార్టీ కార్యక్రమాలకు కొన్ని రోజుల పాటు అందుబాటులో లేరు కాటిపల్లి. ఎక్కడా ఆయన పేరు సైతం సరిగా విన్పించని పరిస్థితి. ఇప్పుడిప్పుడే మళ్లీ నియోజకవర్గంలోని కార్యక్రమాలకు హాజరవుతున్న ఆయన.. రాష్ట్రస్థాయిలో జరిగే కార్యక్రమాలపై పెద్దగా స్పందించడం లేదన్న అభిప్రాయం కార్యకర్తల్లోనే విన్పిస్తోంది.

**రామచంద్రరావును కలిసేందుకు సైతం రాని కాటిపల్లి..!**

ఎక్కడిదాకో ఎందుకు తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు రామచంద్రరావు. ఇలాంటి వేళ కనీసం నూతన అధ్యక్షుడ్ని విష్ చేసేందుకు సైతం ఆయన రాకపోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. కమలం పార్టీ ఎమ్మెల్యేగా ఉన్న కాటిపల్లి ఎందుకు రాలేదు..? నియోజకవర్గంలో అంత పని ఏం ఉంది..? అయినా ఎంత వర్క్ ఉన్నా.. పార్టీకి నూతన అధ్యక్షుడు వచ్చినప్పుడు కనీసం వచ్చి కలవడం అనేది నేతలు సర్వసాధారణంగా చేసే పని. మరి ఆ రకంగా చూసినా ఆయన ఎందుకు రాలేకపోయారు అన్న ప్రశ్న తలెత్తుతోంది.

**గతంలో ఎంతో యాక్టివ్‌గా కన్పించిన వెంకట రమణారెడ్డి**

వాస్తవానికి కొన్ని నెలల క్రితం కాటిపల్లి పార్టీలో ఎంతో యాక్టివ్‌గా కన్పించారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మూసీ ప్రక్షాళనను అడ్డుకుంటామన్నారు. హైడ్రా కూల్చివేతలకు వ్యతిరేకంగా గళమెత్తారు. అసలు కార్పొరేట్ల కోసమే ఈ కూల్చివేతలు అంటూ అందుకు సంబంధించిన ఆధారాలు సైతం తన వద్ద ఉన్నాయంటూ ప్రకటించారు. అంతేనా.. తన వద్ద ఉన్న ప్రూఫ్స్ అబద్ధమని నిరూపిస్తే సూసైడ్ చేసుకుంటా అన్న రేంజ్‌లో కమలం తరపున బలంగా గళం విన్పించారు కాటిపల్లి. అలాంటి నేత ఎందుకు ఇప్పుడు రాష్ట్ర కార్యాలయానికి, రాష్ట్ర నాయకత్వానికి దూరంగా ఉంటున్నారన్న చర్చ నియోజకవర్గంలో నడుస్తోంది. అదే సమయంలో ఇటీవలి కాలంలో నియోజకవర్గంలో తిరుగుతున్న కాటిపల్లి.. రాష్ట్ర కార్యాలయం వైపు కన్నెత్తి చూడకపోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**కాటిపల్లి మౌనం వెనుక మర్మమేంటి..?**

ఇక్కడే మరో మాట విన్పిస్తోంది. కేవలం కాటిపల్లి మాత్రమే కాదు.. బీజేపీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు మరికొందరు సైతం పార్టీ పట్ల అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్నారట. ఎమ్మెల్యే రాజాసింగ్ బహిరంగంగానే తన అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం ఇదే కాదు.. గతంలోనూ ఇలాంటి సందర్భాలు చాలానే ఉన్నాయన్న టాక్ విన్పిస్తోంది. పైగా రాష్ట్ర నాయకత్వానికి వ్యతిరేకంగా ఎమ్మెల్యేలు అసెంబ్లీ, బీజేఎల్పీ కార్యాలయంలో సమావేశమైన విషయాలను గుర్తుచేస్తున్నారు. కానీ.. అప్పటితో పోలిస్తే ఇప్పటికి అధ్యక్షులు మారారు.నూతన నాయకత్వం కొలువు తీరింది. మరి పార్టీలో ఇప్పటికైనా ఎమ్మెల్యేలు తమ వైఖరి మార్చుకుంటారా..? లేదంటే అంటీ ముట్టనట్లుగానే వ్యవహరిస్తారా..? అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఇతర ఎమ్మెల్యేల సంగతి కాస్త పక్కన పెడితే బీజేపీలో జెయింట్ కిల్లర్‌గా పేరు పొందిన కాటిపల్లి మౌనం వెనుక.. కారణాలు ఏంటన్న వాటిపై జోరుగా చర్చ జరుగుతోంది.

# అధిష్టానం ఆశలన్నీ తెలంగాణ పైనే!



హైదరాబాద్,తెలంగాణలో మరో రెండున్నర మూడు నెలల్లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రధాన పార్టీలు సిద్దమవుతున్నాయి. ముఖ్యంగా, తెలంగాణను రోల్ మోడల్ గా చూపించి జాతీయ స్థాయిలో పునర్జీవనం పొందేందుకు ప్రయత్నిస్తున్న అధికార కాంగ్రెస్ పార్టీ.. స్థానిక సంస్థల ఎన్నికలను, జాతీయ దృక్కోణంతో చూస్తోంది. అందుకే.. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ సంస్థాగత వ్యవహారాల జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్వయంగా రంగంలోకి దిగారు. సామాజిక న్యాయ సదస్సు పేరిట జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వాన్ని, ప్రధాని మోదీని టార్గెట్ చేస్తూ ఘాటైన విమర్శలు చేశారు. అలాగే.. పార్టీలో అసమ్మతి మొదలు పదవుల భర్తీ వరకు అనేక విషయాలను సమీక్షించి రాష్ట్ర పార్టీకి దిశానిర్దేశం చేశారు. ఈ మొత్తం కసరత్తును చూస్తే.. స్థానిక ఎన్నికలకు కాంగ్రెస్ అధిష్టానం ఎంత ప్రాధాన్యత ఇస్తోందో అర్థమవుతుందని పరిశీలకులు అంటున్నారు. అలాగే, ఎందుకు ఇంత ప్రాధాన్యత ఇస్తోందో కూడా వేరే చెప్పనవసరం లేదంటున్నారు. ఆ విషయం కూడా కేసీ వేణుగోపాల్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధిష్టానం తెలంగాణను రోల్ మోడల్ గా భావిస్తోందని స్పష్టంగానే చెప్పారు. నిజానికి ఇప్పుడు వేణుగోపాల్ చెప్పడం కాదు.. ఎప్పుడోనే పార్టీ కీలక నాయకుడు రాహుల్ గాంధీ కులగణన విషయంగా తెలంగాణ మోడల్ ది బెస్ట్ అని ప్రకటించారు. అంతే కాకుండా.. జాతీయ స్థాయిలో జనగణనతో పాటుగా చేపట్టే కులగణనకు తెలంగాణ మోడల్ ఫాలో కావాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే.. తాజాగా సామాజిక న్యాయ సదస్సు వేదిక నుంచి చేసిన ప్రసంగంలో పార్టీ అధ్యక్షుడు ఖర్గే.. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తొలిసారిగా కులగణన చేయించి దేశానికే ఆదర్శంగా నిలిచిందని కితాబు నిచ్చారు. అంతే కాదు.. జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు దక్కే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందనీ, ఈ పోరాటంలో రాష్ట్ర ప్రజలు కూడా తమకు మద్దతు ఇవ్వాలని పిలుపు నిచ్చారు. సో...కాంగ్రెస్ అధిష్టానం కులగణనకు ఎంత ప్రాధాన్యత ఇస్తోందో.. తెలంగాణ స్థానిక ఎన్నికలకూ అంతే ప్రాధన్యత ఇస్తోందని, అంత సీరియస్ గా తీసుకుంటోందని అంటున్నారు.అందుకే.. కాంగ్రెస్ పార్టీ వాగ్దానం చేసిన విధంగా 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలు చేసిన తర్వాతనే స్థానిక ఎన్నికలకు వెళ్ళాలని భావిస్తోందని అంటున్నారు. అయితే, నిర్ణయం కేంద్రం కోర్టులో ఉన్నదున.. ప్రస్తుత పరిస్థితిలో అది సాధ్యం కాకపోవచ్చని రాజకీయ విశ్లేషకులు, న్యాయ నిపుణులు అంటున్నారు.అయినా.. అధిష్టానం ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో సంబంధం లేకుండా 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలు చేసేందుకు గల ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించేందుకు న్యాయనిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. అయితే.. ఒక్క బీసీ కులగణన, బీసీ రిజర్వేషన్ వాగ్దానంతోనే కాంగ్రెస్ పార్టీ స్థానిక ఎన్నికల్లో విజయం సాధిస్తుందా? లేక అమలు కాని హామీలు, గ్యారెంటీలు, రైతులు, నిరుద్యోగ యువకులు, మహిళలు ఇలా విభిన్న వర్గాల ప్రజల్లో క్షణ క్షణం పెరుగుతున్న అసంతృప్తి, పార్టీలో పెరుగుతున్న అసమ్మతి వంటి ప్రతికూల అంశాలు కూడా స్థానిక ఎన్నికలపై ప్రభావం చూపుతాయా అనేది చూడవలసి ఉందని అంటున్నారు. ఏది ఏమైనా.. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మాత్రం హోప్స్ అన్నీ తెలంగాణ పైనే పెట్టుకుందని పరిశీలకులు పేర్కొంటున్నారు.

# జమిలికి గ్రీన్ సిగ్నల్? అన్ని లెక్కలూ కుదిరాయి!



న్యూఢిల్లీ,దేశంలో జమిలి ఎన్నికలకు మార్గం సుగమం అయింది. దీనిపై కేంద్రం ఇప్పటికే నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. మాజీ రాష్ట్రపతి కోవింద్ నేతృత్వంలో వేసిన అత్యున్నత స్థాయి కమిటీ దీనిపై నివేదికను కూడా కేంద్రానికి ఇచ్చింది. ఆ తర్వాత.. రాష్ట్రాలతోనూ చర్చించారు. అయితే.. కొన్ని రాష్ట్రాలు ఓకే చెప్పాయి. మరికొన్ని ఇంకా పెండింగులోనే పెట్టాయి. ముఖ్యంగా కాంగ్రెస్ సహా.. స్థానిక పార్టీల నేతృత్వంలో నడుస్తున్న ప్రభుత్వం ఉన్న రాష్ట్రాలు జమిలికి ఇంకా గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. ఇంతలోనే కేంద్రంపై కొందరు న్యాయవాదులు ప్రశ్నలు సంధించారు.ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం ద్వారా.. ఎన్నికల సంఘం ఏమేరకు పనిచేస్తుందని వారు సందేహం వ్యక్తం చేశారు. అదేవిధంగా జమిలి నిర్వహణతో ఖర్చులు తగ్గుతాయని.. ప్రభుత్వ ఖజానాకు ఆదా పెరుగుతుందన్న వాదనను కూడా వారు కొట్టేశారు. ఇక, ఒకేదఫా ఎన్నికలు నిర్వహణ ద్వారా.. అవినీతి పెరుగుతుందన్న వాదనను కూడా తెరమీదికి తెచ్చారు. అయితే.. వాటికి కేంద్రం నుంచి సరైన సమాధానాలు రాలేదు. దీంతో ఢిల్లీ బార్ అసోసియేషన్ సహా.. దేశవ్యాప్తంగా వందల సంఖ్యలో సుప్రీంకోర్టులో పిటిషన్లు పడ్డాయి. ఈ నేపథ్యంలో కేంద్రం కూడా సుప్రీంకోర్టు మాజీ రాష్ట్రపతి ఇచ్చిన నివేదికను పంపించింది.ఆ నివేదిక ప్రకారమే తాము వ్యవహరిస్తున్నామని పేర్కొంది.దీనిపై అధ్యయనం చేసి.. పిటిషన్లను క్వాష్ చేయాలని అభ్యర్థించింది. ఇక, తాజాగా సుప్రీంకోర్టు ఈ నివేదికను పరిశీలించి.. జమిలి ఎన్నికలపై సానుకూలంగా నిర్ణయం తీసుకుంది. కేంద్రం ప్రతిపా దించిన ఖర్చు తగ్గింపును సుప్రీంకోర్టు కూడా సానుకూలంగా అంగీకరించింది. అదేవిధంగా పదే పదే ఎన్నికలు నిర్వహించడం ద్వారా.. పాలనకు విఘాతం ఏర్పడుతోందని.. అభివృద్ధి ముందుకు సాగడం లేదని పేర్కొన్న వాదనలతో ఏకీభవించింది.

# యోగి ఆదిత్యనాథ్‌కు ఢిల్లీ సీఎం సంచలన లేఖ..




ఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా.. ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యానాథ్‌కు లేఖ రాయడం సంచలనంగా మారింది. ఈ సందర్భంగా యమునా నదిలో ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని యోగి సర్కార్‌ను ఆమె కోరారు. అక్రమ తవ్వకాల కారణంగా ఢిల్లీకి ప్రమాదం పొంచి ఉందన్నారు. ఇసుక అక్రమ తవ్వకం విషయాన్ని అంతర్–రాష్ట్ర సమస్యగా చెప్పుకొచ్చారు.ఢిల్లీ–ఉత్తరప్రదేశ్ సరిహద్దు సమీపంలోని యమునా నది వెంట అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ విషయం ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా దృష్టికి చేరడంతో ఆమె స్పందించారు. ఈ నేపథ్యంలో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు లేఖ రాశారు. ఈ లేఖలో రేఖా గుప్తా.. యమునా నదిలో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలను అరికట్టడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. ఇలాంటి మైనింగ్ కార్యకలాపాలు నది కరకట్టలను బలహీనపరుస్తున్నాయి. దీంతో, దేశ రాజధానిలో వరదల ప్రమాదాన్ని పెంచే అవకాశం ఉంది. ఇటువంటి కార్యక్రమాలు నది సహజ మార్గాన్ని కూడా మారుస్తాయి. ఇది నది పరిసర ప్రాంతాల్లో నివసించే వారిపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇసుక అక్రమ తవ్వకం వరద ప్రమాదాన్ని కలిగించడమే కాకుండా దీర్ఘకాలిక పర్యావరణ నష్టాన్ని తెచ్చిపెడుతోంది. అక్రమ మైనింగ్‌పై అటు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కూడా ఆందోళన వ్యక్తం చేసింది. అక్రమ ఇసుక తవ్వకాన్ని తీవ్రమైన పర్యావరణ సమస్యగా ఎన్జీటీ గుర్తించింది. అందుకే ఇప్పటికైనా యూపీ ప్రభుత్వం అక్రమ ఇసుక రవాణాపై దృష్టి సారించాలని కోరుతున్నాను. దీనిపై తక్షణమే నియంత్రణ చర్యలు చేపట్టాలి' అని యోగి ప్రభుత్వాన్ని కోరారు. ఇదే సమయంలో మరిన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. ఇసుక అక్రమ తవ్వకం విషయాన్ని అంతర్–రాష్ట్ర సమస్యగా చెప్పుకొచ్చారు. దీనిపై రెండు ప్రభుత్వాల మధ్య ఉమ్మడి చర్యలు అవసరమని అన్నారు. దీని అమలు బాధ్యతలో గందరగోళాన్ని నివారించడానికి నది వెంబడి అధికార పరిధిని ఉమ్మడిగా గుర్తించడంతో సహా ఢిల్లీ, యూపీ ప్రభుత్వాల మధ్య సమన్వయ చర్యలు తీసుకోవాలని ఆమె ప్రతిపాదించారు. స్పష్టమైన సరిహద్దులు లేకపోవడం వల్లే పర్యవేక్షణ చర్యలు క్లిష్టతరంగా మారినట్టు తెలిపారు. ఢిల్లీ ప్రభుత్వం సహకార విధానాన్ని కోరుతోంది. ఈ సమస్యను పరిష్కరించడానికి యూపీ పరిపాలనా సమన్వయాన్ని ప్రారంభించాలని అభ్యర్థించారు.

# తెలంగాణలో 'ఎన్డీయే' కూటమి.. సాహసం చేస్తారా?



హైదరాబాద్,రాజకీయాలు ఎప్పుడు ఎలా మారతాయో ఎవరూ చెప్పలేరు. పరిస్థితులు, ప్రభావాలు ఎలాంటి నిర్ణయాన్నయినా తీసుకునేలా చేస్తాయి. ముఖ్యంగా రాజకీయాలలో అవకాశం–అవసరం అనేవి కీలక పాత్ర పోషిస్తాయి. ఏ చిన్న అవకాశం చిక్కినా.. పార్టీలు వదులుకునేందుకు ఛాన్స్ ఇవ్వవు. ఇదే.. కూటములు కట్టేందుకు.. పొత్తులు పెట్టేందుకు అవకాశం ఏర్పడేలా చేస్తుంది. తెలం గాణ విషయంపైనా తాజాగా ఇదే చర్చ తెరమీదికి వచ్చింది. ఏపీలో కూటమి కట్టిన బీజేపీ–జనసేన–టీడీపీలు సక్సెస్ అయ్యాయి. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి పక్షాలు విజయ దుందుభి మోగించాయి.కనీవినీ ఎరుగని విధంగా 164 స్థానాల్లో విజయం దక్కించుకుని అధికారంలోకి వచ్చాయి. ఏడాది తర్వాత కూడా.. కూటమి బలంగానే ఉంది. ఎక్కడైనా చిన్న చిన్నలోపాలు ఉన్నాయే తప్ప.. ప్రధానంగా చూస్తే.. బీజేపీ, టీడీపీ, జనసేనల మధ్య చెప్పుకోదగిన లోపాలు.. కుమ్ములాటలు ఎక్కడా లేవనేది తెలుస్తూనే ఉంది. అంతేకాదు.. వచ్చే 15 సంవత్సరాలు కూడా కూటమి కలిసి ఉంటుందని మిత్రపక్షాలుగా ఉన్న జనసేన, టీడీపీలు పదే పదే చెబుతున్నాయి. ఈనేపథ్యంలో తెలంగాణలోనూ ఈ కూటమి పోటీ చేసే అవకాశం ఉందంటూ.. ఓ మీడియా కథనంలో వచ్చిన అంశం రాష్ట్రంలో చర్చకు దారితీసింది.రాజకీయాల్లో ఎక్కడైనా పోటీ చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో కూటమికి తెలంగాణలో పోటీ చేయకూడదన్న భావన అయితే ఉండదు. పైగా.. తెలంగాణలో టీడీపీ, జనసేనలు కూడా ఉన్నాయి. అవి ప్రస్తుతానికి ఏపీకి మాత్రమే పాలనను పరిమితం చేసి నా.. రాజకీయంగా టీడీపీ తెలంగాణలో యాక్టివ్‌గానే ఉంది. జనసేన విషయానికి వస్తే.. మాత్రం.. కొంత సంస్థాగతంగా బలోపేతం కావాల్సి ఉంది. ఇక, తెలంగాణలో బీజేపీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సో.. ఈ నేపథ్యంలో మూడు పార్టీలు కూడా తెలంగాణలో కూటమి కట్టి ఎన్నికలకు వెళ్లే అవకాశం లేకపోలేదన్న వాదన బలంగా వినిపిస్తోంది.

# ఇక గవర్నర్ అశోక్ గజపతిరాజుగా !



విజయనగరం:విజయనగరం జిల్లాకు చెందిన సీనియర్ మోస్ట్ లీడర్, కేంద్ర మాజీ మంత్రి రాష్ట్రంలో దశాబ్దాల పాటు వివిధ మంత్రిత్వ శాఖలలో పనిచేసిన పూసపాటి అశోక్ గజపతిరాజు తొందరలోనే రాజ్ భవన్ లోకి అడుగు పెట్టనున్నారు అని అంటున్నారు. ఆయనను కీలకమైన రాష్ట్రానికి గవర్నర్ గా నియమించేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం సుముఖంగా ఉందని అంటున్నారు.త్వరలోనే బీహార్ తో పాటు మరో మూడు రాష్ట్రాలలో కొత్తగా గవర్నలను నియమించేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దాంతో అందులో ఒక గవర్నర్ పదవిని తమకు నమ్మకమైన మిత్రుడిగా ఏపీలో ఉన్న టీడీపీకి ఇవ్వాలని బీజేపీ ఆలోచిస్తోంది. ఆ విషయాన్ని ఇప్పటికే టీడీపీ అధినాయకత్వానికి తెలియచేసినట్లుగా ప్రచారం సాగుతోందిఇక తెలుగుదేశం పార్టీలో ఇద్దరు సీనియర్లు బాబుకు అత్యంత సన్నిహితులు అయిన అశోక్ గజపతి రాజు యనమల రామక్రిష్ణుడు గవర్నర్ పోస్టు కోసం చూస్తున్నారు అని అంటున్నారు. ఈ ఇద్దరూ రాజ్యాంగపరమైన వ్యవహారాలలో దిట్టలు గా ఉన్నారు. ఇద్దరూ బాబుకు అత్యంత ఆప్తులు ఇద్దరూ ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు ఇద్దరి కుమార్తెలు ఎమ్మెల్యేలుగా 2024 ఎన్నికల్లో గెలిచి వచ్చారు.దాంతో తాము రాజకీయంగా ఇన్నాళ్ళు చేసిన సేవకు గానూ గౌరవనీయమైన విరమణను వారు కోరుకుంటున్నారు. అది రాజ్ భవన్ లో అడుగు పెడితేనే జరుగుతుందని కూడా గట్టిగా నమ్ముతున్నారు. దాంతో ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు. అయితే చంద్రబాబు మదిలో అశోక్ పేరు ఉందని అంటున్నారు.ఆయనను గవర్నర్ పదవికి ఎంపిక చేయాలని నిర్ణయించారని చెబుతున్నారు. కేంద్ర మంత్రి పదవితో పాటు ఏ బాధ్యతను అప్పగించినా పూర్తి న్యాయం చేస్తూ వస్తూ క్లీన్ ఇమేజ్ కలిగిన రాజా వారికి రాజ్ భవన్ దారి చూపించాలని భావిస్తున్నారు అని తెలుస్తోంది.అదే సమయంలో యనమల రామక్రిష్ణుడికి కూడా న్యాయం చేస్తారని అంటున్నారు. 2026లో ఏపీ నుంచి ఖాళీ అయ్యే నాలుగు రాజ్యసభ సీట్లలో ఒకదానిని యనమలకు ఇవ్వడం ద్వారా ఆయన చాలా కాలంగా కోరుతున్న పెద్దల సభలో ప్రవేశించే ముచ్చటను తీరుస్తారని అంటున్నారు.ఇక ఈ గవర్నర్ పదవుల నియామకం పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందుగానే జరుగుతుందని అంటున్నారు. బీహార్ లో ఈ ఏడాది అక్టోబర్ లో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. దాంతో ఆ రాష్ట్రానికి అశోక్ గజపతిరాజు వంటి రాజ్యాంగం పూర్తిగా ఔపాసన పట్టిన వారిని గవర్నర్ గా నియమిస్తారు అని అంటున్నారు. ఒకవేళ అది కాకపోతే తమిళనాడుకు కూడా అశోక్ గవర్నర్ అయ్యే చాన్స్ ఉందిట. మొత్తానికి అతి తొందరలోనే గవర్నర్ అశోక్ గారు అని అంతా పిలవాల్సిన సమయం వచ్చేస్తోంది అని అంటున్నారు.

### జూబ్లీహిల్ గెలుపు కోసం కృషి చేస్తాం

హైదరాబాద్,జూబ్లీహిల్స్ ఉపఎన్నిక తమకు సవాల్ లాంటిదని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. అయితే ఇక్కడ గెలుపు లక్ష్యంఅ తమ వ్యూహాలు ఉంటాయని అన్నారు. బలమైన ప్రతిపక్షం ఉంటే ఉపఎన్నికల్లో అధికార పార్టీ గెలవదన్నారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికలపై భాజపా ఫోకస్ చేయలేదని చెప్పారు. ఈసారి దృష్టి సారిస్తామని.. 25 రోజుల్లో పూర్తిస్థాయి రాష్ట్ర కమిటీని ప్రకటిస్తామని తెలిపారు.

# నేపాల్–చైనా బోర్డర్‌లో ఆకస్మిక వరదలు..



నేపాల్–చైనా సరిహద్దులో ఆకస్మిక వరదలు హడలెత్తించాయి. రసువా జిల్లాలో సరిహద్దుగా ఉన్న భోటేకోషి నది ఒక్కసారిగా ఉప్పొంగింది. దీంతో ఊహించని రీతిలో ప్రళయం సంభవించింది.మిటేరి వంతెన, డ్రై పోర్టు దగ్గర నిలిపి ఉన్న వందలాది వాహనాలు ఒక్కసారిగా కొట్టుకుపోయాయి.చైనా భూభాగంలో ఊహించని రీతిలో కుండపోత వర్షాలు కురిశాయి. అతి భారీ వర్షాలు కురవడంతో మంగళవారం తెల్లవారుజామున సరిహద్దు ప్రాంతాలను వరదలు ముంచెత్తాయి. నేపాల్‌లోని తైమూర్ ప్రాంతంలో అనేక మౌలిక సదుపాయాలు ధ్వంసం అయ్యాయి.భోటేకోషి నది వెంబడి ఉన్న కస్టమ్స్ పోర్టులో నిలిపి ఉన్న 200 వాహనాలు కొట్టుకుపోయాయని రసువా చీఫ్ డిస్ట్రిక్ ఆఫీసర్ అర్జున్ పౌడెల్ తెలిపారు. నేపాల్–చైనాను కలిపే వంతెను కొట్టుకుపోయిందని చెప్పారు. ఇక చాలా మంది వ్యాపారులు గల్లంతైనట్లు చెప్పుకొచ్చారు. ఇక నేపాల్‌కు చెందిన 12 మంది పోలీసులు కూడా గల్లంతైనట్లు సమాచారం. ప్రస్తుతం వాతావరణం ప్రతికూలంగా ఉందని.. పరిస్థితులు శాంతించగానే నేపాల్ సైన్యం సహాయ చర్యలు చేపడుతుందని వెల్లడించారు. ఎంతమంది గల్లంతయ్యారన్న విషయాన్ని ఇంకా క్లారిటీ ఇవ్వలేదు.స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ఈ విపత్తు సంభవించినట్లు తెలుస్తోంది. అందరూ గాఢ నిద్రలో ఉండగా ఊహించని రీతిలో వరద దూసుకొచ్చింది. ఎంత మంది చనిపోయారన్న విషయం అధికారికంగా ప్రకటించలేదు. వాహనాలతో పాటు ప్రజలు కొట్టుకుపోయారని అధికారులు చెబుతున్నారు.వరదలకు గల కారణాలను అధికారులు అంచనా వేస్తున్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com